PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 47 | విజయవాడ, మంగళవారం 17 సెప్టెంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 17 September 2024 | Rs

పటిష్ట ఆదేశాలివ్వండి

- సిజెఐ చంద్రచూడ్‌కు వెయ్యిమందికి పైగా ప్రముఖులు, సంస్థల లేఖ
- సుమోటోగా తీసుకున్నా అభయ కేసులో ఇంత జాప్యమా?

5



ఫైనల్‌కు భారత్

- సెమీస్‌లో కొరియాపై ఘన విజయం
- టైటిల్‌కై నేడు చైనాతో ఢీ

6



అంతర్జాతీయ పునర్వినియోగ ఇంధన సమావేశాన్ని ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ, చిత్రంలో సిఎం చంద్రబాబునాయుడు తదితరులు

సౌర విప్లవంలో సువర్ణాధ్యాయం

అంతర్జాతీయ పునర్వినియోగ ఇంధన సమావేశంలో ప్రధాని మోడీ

రాష్ట్రంలో గ్లోబల్ యూనివర్శిటీ : చంద్రబాబు

గాంధీనగర్/ అమరావతి బ్యూరో : 21వ శతాబ్దపు చరిత్రను లిఖించే సమయంలో సోలార్ రంగంలో భారత్ సాధించబోయే విప్లవం సువర్ణాధ్యాయమవుతుందని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. గాంధీనగర్‌లో గ్లోబల్ రెన్యువబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్ అండ్ ఎక్స్‌పో (ఆర్ఇ-ఇన్వెస్ట్ 2024) 4వ సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారత్‌ను ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు 140కోట్ల మంది భారతీయులు ప్రతినబూనారన్నారు. రాబోయే వెయ్యి సంవత్సరాల్లో అభివృద్ధికి అవసరమైన పునాదిని వేసేందుకు భారత్ చర్యలు తీసుకుంటోందని చెప్పారు. 2047కల్లా అభివృద్ధి చెందిన దేశంగా భారత్ నిలవాలంటే కావాల్సిన ఇంధన అవసరాలు ఏమిటో తెలుసునని, అయితే సొంతంగా చమురు, గ్యాస్ వనరులు లేనందున, ఇంధనపరంగా స్వతంత్రులం కానందున సౌర, పవన, అణు, జల విద్యుత్‌లను బలోపేతం చేసుకుని మన భవిష్యత్‌ను నిర్మించుకోవాలని నిర్ణయించినట్లు మోడీ చెప్పారు. సౌర విద్యుత్ నగరాలుగా అయోధ్యతో పాటూ మరో 16 నగరాలను అభివృద్ధిపరచాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. హరిత ఇంధన రంగంలో కీలకమైన నిర్ణయాలు తీసుకున్నామన్నారు. 500 గిగావాట్ల పునర్వినియోగ ఇంధన లక్ష్యాన్ని సాధించేందుకు అనేక స్థాయిల్లో భారత్ కృషి చేస్తోందన్నారు. పిఎం సూర్య ముఫ్త్ బిజిలీ యోజన అనేది విశిష్టమైన పై కప్పు సౌర పథకమని చెప్పారు. ఇది పెట్టుకునేవారికి ప్రభుత్వం నిధులు అందిస్తుందన్నారు. ప్రతి ఇంటి పైకప్పు మీద సౌర ఫలకాల ఏర్పాటుకు సాయపడు తుందన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం : చంద్రబాబు

పునరుత్పాదక ఇంధనంలో ప్రపంచ అత్యుత్తమ పద్ధతులను అవలంభించడంతో పాటు ఆర్అండ్‌డి, సాంకేతికతను వినియోగించుకోవడం, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు క్లీన్ ఎనర్జీ, సర్క్యులర్ ఎకానమీ గ్లోబల్ యూనివర్శిటీని రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగంలో రాష్ట్రంలో తీసుకురానున్న విధాన మార్పులను మిగతా 2లో

అవును, ధరలు పెరిగాయి

• ప్రభుత్వం ఒప్పుకోలు • ప్రణాళిక శాఖ నివేదిక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడి కంట తడిపెట్టిస్తున్నాయి. బియ్యం, పప్పుల నుండి కూరగాయల ధరలు కూడా పైపైకే చూస్తుండటంతో సగటు జీవి బతుకు గందరగోళంగా మారుతోంది. నెలలు, సంవత్సరాల తరబడి వీటి ధరల పెరుగుదల కొనసాగుతోంది. ధరలను అదుపుచేశామని, ద్రవ్యోల్బణం నియంత్రణలోనే ఉందని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు భిన్నంగా క్షేత్రస్థాయి పరిస్థితులు నెలకొన్నాయి. ధరల పెరుగుతున్న తీరును రాష్ట్ర ప్రభుత్వమే ధృవీకరించడం విశేషం. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ధరలను పరిశీలించి ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక శాఖ రెండు నివేదికలను రూపొందించింది. గత ఏడాది జులై నుండి ఈ ఏడాది జులై వరకు ఒక నివేదిక రూపొందించగా, సెప్టెంబర్ మొదటి రెండు వారాలను పోలుస్తూ మరో నివేదికను ప్రణాళిక శాఖ తయారుచేసింది. ఈ రెండు నివేదికల్లోనూ ధరలు పెరిగినట్లు స్పష్టమైంది. గత ఏడాది జులై కన్నా ఈ ఏడాది జులైలో అధికధరలు నమోదయ్యాయి. ఈ ఏడాది జులైతో పోలిస్తే సెప్టెంబర్ మొదటి వారంలోనూ, దానితో పోలిస్తే రెండవవారంలోనూ ధరలు పెరగడం పరిస్థితి తీవ్రతను తెలియచేస్తోంది. ఉప్పు. మినపగుళ్ళు, బంగాళాదుంపలు వంటి వాటిలో సెప్టెంబర్ మొదటి వారంతో పోలిస్తే రెండవ వారంలో కొంత తగ్గుదల కనిపించినప్పటికీ, అది నామమాత్రమే. కిలోకు పెరుగుదల రూపాయల్లో కనిపిస్తుండగా, తగ్గుదల మాత్రం పైసల్లో ఉండటం గమనార్హం.

జులై వరకు ఇలా...

కీలకమైన బియ్యం ధరలు ఏమాత్రం అదుపుకావడం లేదు. గత ఏడాది జూలై నెలలో ధరల కన్నా ఈ ఏడాది జూలై నెలకు కిలో బియ్యంపై ఆరు నుంచి ఏడు రూపాయల వరకు పెరుగుదల కనిపించింది. సూపర్ ఫైన్ రకం బియ్యం గత జూలైలో 57 రూపాయలుగా ఉండగా, ఈ జూలైలో 64 నాలుగు రూపాయలకు చేరుకుంది. రెండో రకం బియ్యం కూడా గత జూలైలో 50 రూపాయలుగా ఉండగా, ఈ ఏడాది జులైనాటికి 56 రూపాయలకు చేరుకుంది.

పప్పుల ధరలు కూడా ఇదే పరిస్థితి. గత జూలైలో 152 రూపాయలుగా ఉన్న కిలో కందిపప్పు ధర ఈ ఏడాది జూలైకి 180 రూపాయలకు చేరుకుంది. సెనగపప్పు ధర కూడా గత జూలైలో 73 రూపాయలుగా ఉండగా, ఇప్పుడు 92 రూపాయలకు చేరుకుంది.ఇతర పప్పుల ధరలు కూడా గణనీయంగానే పెరిగినట్లు ప్రభుత్వమే చెబుతోంది. నూనెల ధరల్లో మాత్రం స్వల్ప తగ్గుదల నమోదైంది. కూరగాయల ధరు కూడా ఏమాత్రం తగ్గడం లేదు. గత ఏడాది జూలైలో 25 రూపాయలుగా

ఉన్న ఉల్లిపాయల ధర ఈ ఏడాది జూలైకి 44 రూపాయలకు చేరింది. వంకాయలు కిలో గత ఏడాది జులైలో 44.79 రూపాయలు ఉండగా, ఈ ఏడాది జులై నాటికి 50.61 రూపాయలకు చేరాయి. 32.99 రూపాయలుగా ఉన్న బంగాళాదుంపలు ఈ ఏడాది జులైకి 43.81 రూపాయలకు చేరింది. అరటిపళ్లు డజను 44 రూపాయల నుండి 48 రూపాయలకు చేరింది. టమాటాల ధరల్లో మాత్రం తగ్గుదల నమోదైంది.


సెప్టెంబర్‌లో ...


ఈ ఏడాది జులైలో 51.01 రూపాయలుగా ఉన్న గ్రేడ్-1 బియ్యం ధర ఈ సెప్టెంబర్ మొదటి వారానికి 63.64కు. రెండవవారానికి రూ. 63.84కు చేరాయి. గత ఏడాది 152 రూపాయలుగా ఉన్న కిలో కందిపప్పు ఈ ఏడాది సెప్టెంబర్‌కు 173.81 రూపాయలకు చేరింది. మిగిలిన నిత్యావసర వస్తువుల పరిస్థితి కూడా ఇంతే. టమాటా, బంగాళాదుంపల ధరల్లో మాత్రం కొద్దిపాటి తగ్గుదల నమోదైంది.



పలు సరుకుల ధరలు (కేజీకి రూపాయల్లో)

సరుకు	2023 జూలై	2024 జూలై	సెప్టెంబర్‌లో
గ్రేడ్-1 బియ్యం	57.01	63.44	63.84
గ్రేడ్-2 బియ్యం	49.96	55.85	55.85
కందిపప్పు	152.31	179.45	173.81
శెనగపప్పు	73.21	91.87	103.86
మినపప్పు	117.17	125.42	136.35
ఉల్లి	25.35	43.80	59.12
వంకాయ	44.79	50.61	50.73





'ఉక్కు'పై కుట్రల పరంపర

- 'పీకనులిమే చర్యలపైనే కేంద్రం దృష్టి
- అమ్మకమే మా విధానమన్న కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి
- వంద మందిని తక్షణం నాగర్‌నార్‌కు పంపాలంటూ తాజా ఉత్తర్వులు



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశంలోని ప్రతిష్టాత్మక వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రంలోని బిజెపి సర్కారు పూటకో మాట, రోజుకో ఉత్తర్వు ఇస్తోంది. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం దీనిపై సరైన రీతిలో స్పందించడం లేదు. అయితే, విశాఖకు చెందిన టిడిపి ఎంపీ శ్రీభరత్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఆ పార్టీల ఎమ్మెల్యేలు మాత్రం ప్రయివేటీకరణ కాకుండా చూస్తామంటూ రోజూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ స్పందనలో మార్పు వస్తుందని పలువురు ఆశించారు. తాజాగా కేంద్ర బిజెపి ప్రభుత్వ యాక్షన్ చూస్తే ఆ భ్రమలు పటాపంచలయ్యాయని చెప్పక తప్పదు. ఎందుకంటే ఓ వైపు స్టీల్‌ప్లాంట్‌లోని మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో ఒక్కదాంట్లోనే ఉత్పత్తి సాగించాలంటూ నిర్ణయం తీసుకుని ఇప్పటికే రెండింటిని మూసేశారు. మరోవైపు గంగవరం పోర్టు నుంచి ప్లాంట్‌కు లక్ష టన్నులకుపైగా కోల్, రా మెటీరియల్ రావాల్సి ఉండగా నోరుమెదపడం లేదు. ఇంకోవైపు మ్యాన్ పవర్‌ను తగ్గించే కుట్రలను చాపకింద నీరులా స్టీల్ యాజమాన్యంతో కేంద్రం చేయిస్తోంది. ప్లాంట్‌లోగల 24 వేల మందిలో ఇప్పటికే 12 వేల మందికి కార్మికులు కుదించబడ్డారు. పదేళ్లుగా కొత్త రిక్రూట్‌మెంట్ లేదు.

15న నాగర్‌నార్ ప్లాంట్ నుంచి లేఖ

ఈ నెల 15న ఛత్తీస్‌గఢ్‌లోని నాగర్‌నార్ స్టీల్‌ప్లాంట్ (ఎన్ఎస్ఎల్) నుంచి వైజాగ్ ఆర్ఐఎన్ఎల్‌కు వచ్చిన ఉత్తర్వులు చూస్తే 500 మంది మ్యాన్‌పవర్ తమకు కావాల్సి ఉండగా తక్షణమే ఈ నెల 23 నుంచి 25లోగా వంద మందిని డిప్యుటేషన్‌పై పంపించాలంటూ విధి విధానాలను ఉక్కు డైరెక్టర్ ప్రాజెక్ట్స్‌కు అందించారు. దీంతో, కార్మికులు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. ఈ విషయంపై విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, రామస్వామి మాట్లాడుతూ ఇది వంద మందితో ఆగిపోయే వ్యవహారం కాదని, మొత్తం ప్లాంట్ పీక నులిమే చర్యలను కేంద్ర బిజెపి సర్కారు తీవ్రతరం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరగా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని మోడీ సర్కారుపై ఒత్తిడి తెచ్చి మ్యాన్‌పవర్‌ను తీసుకెళ్లే కుట్రలను నిలువరించాలని డిమాండ్ చేశారు.

బయట పడ్డ ప్రమాదం

ఈ ఏడాది ఆగస్టు 8న రాజ్యసభలో విశాఖ వైసిపి రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై వదంతులు వస్తున్నాయని, అలా జరగే వీల్లేదని కార్మికులు, ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి కలుగజేసుకుని 'వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ప్రయివేటీకరణ నిర్ణయమైందని, 2021 జనవరి 27న ఆత్మనిర్భర్ భారత్ కోసం ఎంటర్‌ప్రైజెస్ (పిఎస్ఇ) పాలసీ నోటిపై మిగతా 2లో

డ్రైడే పాటించండి

- నూతన మద్యం పాలసీపై మహిళా సంఘాల ఐక్యవేదిక

2

రాజధాని రైతులకు వార్షిక కౌలు విడుదల

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని రైతులకు గతేడాది జూన్‌లో ఇవ్వాల్సిన కౌలు డబ్బులు రూ.182 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఈ నిధులు రైతుల ఖాతాల్లో జమకావడం ప్రారంభమైంది. గతేడాది జూన్‌లో చెల్లించాల్సిన డబ్బులకు సంబంధించి అప్పటి ప్రభుత్వం జిఒ విడుదల చేసినా రైతుల ఖాతాల్లో జమ కాలేదు. దీనిపై పలువురు రైతులు హైకోర్టులో పలుమార్లు వ్యాజ్యం దాఖలు చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా పిటిషన్ దాఖలు చేసిన వారికి మాత్రమే కౌలు సొమ్ము జమ చేసి మిగతా వారికి జమ చేయలేదు. ఈ డబ్బులను టిడిపి కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. కాగా, ఈ ఏడాది జూన్‌లో చెల్లించాల్సిన సొమ్ము ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

షాంఘైను తాకిన 'బెబింకా'

• వణుకుతున్న ఆర్థిక నగరం • 75 ఏళ్ల తర్వాత తీవ్ర తుపాను



బీజింగ్ (చైనా) : చైనా ఆర్థిక నగరమైన షాంఘైను బెబింకా తుపాను వణికిస్తోంది. సోమవారం ఉదయం 7.30గంటల సమయంలో షాంఘై నగరాన్ని తాకిన ఈ తుపాను కారణంగా అక్కడి జనజీవనం స్తంభించింది. ఏడున్నర దశాబ్దాల కాలంలో ఈ నగరాన్ని తాకిన తీవ్ర తుపాను ఇదేనని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. గంటకు 151 కి.మీ. వేగంతో తుపాను షాంఘై నగరాన్ని తాకిందని స్థానిక మీడియా వెల్లడించింది. ఈ నగరాన్ని తుపాన్లు నేరుగా తాకడం అరుదు. 1949లో టైఫూన్ గ్లోరియా తర్వాత షాంఘైను తాకిన తీవ్ర తుపాను ఇదే. ఈ కారణంగా ఆదివారం రాత్రి నుండి అక్కడి రెండు విమానాశ్రయాల నుంచి రాకపోకలు సాగించాల్సిన వందల విమానాలు రద్దయ్యాయి. పలు రైళ్లు కూడా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. షాంఘై డిస్నీ రిసార్ట్‌తో సహా నౌకలను రీకాల్ చేశారు. పర్యాటక ప్రదేశాలను ఆదివారం మూసివేశారు. తూర్పు చైనాలో ఈదురుగాలులు, భారీ వర్షాలు కురుస్తాయని చైనా వాతావరణ యంత్రాంగం ఆదివారం మధ్యాహ్నం టైఫూన్ రెడ్ అలర్ట్ ప్రకటించింది.

హైనాన్ ప్రావిన్స్‌లో యాగి తుపాను

మరోవైపు చైనాలోని హైనాన్ ప్రావిన్స్‌ను యాగి తుపాను కకావికలం చేసింది. బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలు కురవడంతో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. సెల్‌ఫోనుల్లో ఛార్జింగ్ అయిపోవడంతో డిజిటల్ చెల్లింపులకు ప్రజలు నానాతంటాలు పడ్డారు. అంధకారంలో గడిపారు. కనీసం నిత్యావసర సరకులను కూడా కొనుగోలు చేయలేని పరిస్థితులు నెలకొన్నాయని పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి.



సిపిఎం బైక్ యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న జగ్గునాయుడు

పరిశ్రమల్లో ప్రమాదాలకు బాధ్యత ప్రభుత్వానిదే...

- ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి
- కార్మిక రక్షణ యాత్ర ప్రారంభ సభలో జగ్గునాయుడు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

ఫార్మా, సెజ్ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు అమలు చేయని యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఉద్యోగుల, కార్మికుల ప్రాణాలకు విలువ ఇవ్వని యాజమాన్యాల పట్ల ప్రభుత్వాలు ఉదాసీనత విడనాడాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలకు బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఫార్మా, సెజ్ కార్మికుల భద్రతకు ఈ నెల 16 నుంచి 20 వరకూ సిపిఎం ఆధ్వర్యాన తలపెట్టిన రక్షణ యాత్ర బైక్ ర్యాలీని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో సోమవారం మిగతా 2లో

యువరైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - గుంతకల్లు రూరల్

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం జిల్లా గుంతకల్లు మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. చింతలంపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ (34) తనకున్న నాలుగు ఎకరాల పొలంలో మిరప పంట సాగు చేశారు. పంట దిగుబడి రాకపోవడంతో ఈ ఏడాది మరో 20 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేశారు. పంట చేతికొచ్చే సమయంలో ఎడతెరిపి లేని వర్షాలతో పంట మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. మూడేళ్లుగా పంట సాగుకు, కుటుంబ పోషణకు దాదాపు రూ. 20 లక్షల దాకా అప్పు చేశారు. అప్పులు తీరే దారిలేకపోవడంతో తన పొలంలోనే పురుగు మందు తాగి ఆత్మహత్య చేసకున్నారు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అమరావతిలో నిర్మాణాలు పదిలం

- ఐఐటి నివేదిక సమర్పించిందని మంత్రి నారాయణ వెల్లడి
- వైకుంఠపురం వద్ద కొత్త లిఫ్టు
- 3 కాలువలు, 6 రిజర్వాయర్లు
- 15 లక్షల క్యూసెక్కులు తట్టుకునేలా కరకట్ట పటిష్టం



అమరావతిలో నిర్మాణలో ఉన్న ఎన్‌జిఒల నివాస భవనాలు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో ఐకానిక్ భవనాల కోసం వేసిన ర్యాఫ్ట్, ఇతర నిర్మాణాలు పదిలంగా ఉన్నాయని ఐఐటి నిపుణులు నివేదిక ఇచ్చినట్లు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. సిఆర్‌డిఏ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్మాణాలు కొనసాగించుకోవచ్చని ఐఐటి నిపుణులు తెలిపినట్లు చెప్పారు.

2014-19 మధ్య చేపట్టిన ఈ భవనాల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిన సంగతి తెలిసిందే. వీటి పటిష్టతను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని ఐఐటి అధికారుల నిపుణులను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ నేపథ్యంలో వీటిని పరిశీలించిన నిపుణుల బృందం సెక్రటేరియట్ ఐకానిక్ టవర్ల కోసం వేసిన ర్యాఫ్ట్ బలంగానే ఉందని పేర్కొందని నారాయణ చెప్పారు. అదే విధంగా హైకోర్టు, ఉద్యోగుల భవనాల కోసం చేపట్టిన నిర్మాణాలతోపాటు, 3600 ఫ్లాట్ల పనులకు కూడా ఎటువంటి ఇబ్బంది లేదని వారు స్పష్టం చేసినట్లు తెలిపారు. నిర్మాణాలు కొనసాగించుకోవచ్చని ఐఐటి నిపుణులు నివేదిక ఇచ్చిన నుపథ్యంలో రాబోయే ఆ పనుల కొనసాగింపు కోసం రెండు మూడు నెలల్లో టెండర్లు పిలుస్తామని పేర్కొన్నారు. అలాగే జంగిల్ క్లియరెన్స్ పనులకు వర్షాల వల్ల ఇబ్బంది కలిగిందని, త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ఒక ఏడాది కౌలు కింద రూ.175 కోట్లను ఒకటి రెండు రోజుల్లో జమచేస్తామని మంత్రి తెలిపారు. దీనికి సంబంధించి సోమవారం ఆదేశాలు జారీచేసినట్లు చెప్పారు. ల్యాండ్ పూలింగుకు భూములిస్తే తానే స్వయంగా వెళ్లి తీసుకుంటున్నానని, గతంలో ఇవ్వని వారు కూడా ప్రస్తుతం ముందుకొస్తున్నారని తెలిపారు. విజయవాడలో వరద ప్రాంతాల్లో ప్రజల పన్నుల చెల్లింపు గడువు పొడిగిస్తామని ఒక ప్రశ్నకు జవాబుగా మంత్రి పేర్కొన్నారు.

ముంపు లేకుండా రిజర్వాయర్లు, కాల్వలు

అమరావతి నగరానికి ముంపు లేకుండా రిజర్వాయర్లు, కాల్వలు నిర్మిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. అమరావతి రాజధానికి పనికిరాదని, గతంలో ప్రపంచబ్యాంకుకు లేఖలు రాశారని, 11.45 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా అమరావతికి ఏమీ కాలేదని తెలిపారు. అలాగే మిగతా 2లో

కల్లుకుంట సంఘటనపై కేసు నమోదు చేయండి

- జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు కెవిపిఎస్ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కర్నూలు జిల్లా పెద్దకడుబూరు మండలం, కల్లుకుంటలో దళిత మహిళను అవమానపరిచి, విద్యుత్తు స్థంభానికి కట్టేసి కొట్టిన ఆధిపత్య అగ్రకులస్థుందరిపై కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కెవిపిఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ.నల్లప్ప, అండ్ర మాల్యాద్రిలు సోమవారం జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు లేఖ రాశారు. నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని కోరారు. కర్నూలు జిల్లాలో దళితులపై జరుగుతున్న దారుణాలపై ప్రత్యేకచర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు.

రిజర్వ్ ఫారెస్ట్‌లోనే చిరుత సంచారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం శివారు దివాన్ చెరువు రిజర్వ్ అటవీ ప్రాంతంలోనే చిరుత సంచరిస్తోందని అటవీశాఖ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో అమర్చిన ట్రాప్ కెమెరాలలో చిరుతపులి కదలికలు రికార్డు అయ్యాయన్నారు. చిరుతను పట్టుకునేందుకు ట్రాప్ బోనులను ఏర్పాటు చేశామని, 50 మంది సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేసి పులి కదలికలను పరిశీలిస్తున్నామని తెలిపారు. నివాస ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్టు ఎటువంటి ఆధారాలూ ఇప్పటి వరకు లభించలేదని, థర్మల్ డ్రోన్ కెమెరాను ఉపయోగించి శోధన ప్రారంభించామని, దివాన్‌చెరువు, ఆటోనగర్ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాలకు బాధ్యత ప్రభుత్వానిదే...

(మొదటి పేజీ తరువాయి

ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ పరిశ్రమలు వస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఉపాధి లభిస్తుందని ఆశతో భూములిచ్చిన వారికి ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయన్నారు. నిర్వాసితులకు, స్థానికులకు పరిశ్రమల్లో 75 శాతం ఉపాధి కల్పించడం లేదని తెలిపారు. పరిశ్రమల్లో ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫార్మా యజమానులు లాభాలు ఆర్జిస్తున్నారు తప్ప, భూములిచ్చిన రైతులను, నిర్వాసితులను పట్టించుకోవడం లేదన్నారు. కాలుష్యాన్ని, ప్రమాదాలను నియంత్రించలేని, ఉపాధి, ఉద్యోగ భద్రత కల్పించలేని పరిశ్రమలు దేనికని ప్రశ్నించారు. పరిసర వాయు, జల వనరులు కలుషితమవడంతో ప్రజలు అనేక వ్యాధుల పాలవుతున్నారని తెలిపారు. యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా అసెన్షియాలో 17 మంది, సినర్జిన్ ఫార్మా కంపెనీలో నలుగురు మృతి చెందినట్లు నివేదికలు వచ్చినా, కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బ్రాండిక్స్‌లో విషవాయువు విడుదలతో 539 మంది మహిళా కార్మికులు అస్వస్థతకు గురయ్యారని గుర్తు చేశారు. యాజమాన్య నిర్లక్ష్యం వల్ల జరుగుతున్న ప్రమాదాల్లో కార్మికుల మృతితో వారి కుటుంబాలు వీధినపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సేఫ్టీ ఆడిట్ నిర్వహించి లోపాలను సరిచేసేలా ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో నిధులు సమకూర్చుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వాలు వెనుకాడుతున్నాయన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను, యాజమాన్య నిర్లక్ష్యాన్ని ప్రజలకు వివరించి, ప్రమాదాల నియంత్రణకు ఒత్తిడి తెచ్చేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బైక్ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. బైక్ ర్యాలీకి నేతృత్వం వహిస్తోన్న సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ పరిశ్రమలకు అడ్డగోలుగా అనుమతులు మంజూరు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భద్రతను విస్మరిస్తున్నాయన్నారు. కార్మికుల, ఉద్యోగుల ప్రాణాలకు యాజమాన్యాలు బాధ్యత వహించాలని, భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలను ప్రభుత్వం శిక్షించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో కార్మికులకు ప్రాణ నష్టం జరగకుండా, గాయపడకుండా రక్షణ పరికరాలను అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, జి.కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, ఆర్.రాము, గనిశెట్టి సత్యనారాయణ, గంటా శ్రీరామ్, వివి.శ్రీనివాసరావు, అల్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు

- నేలమట్టమైన భవనం
- ఏడుగురికి తీవ్ర గాయాలు, ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - అమలాపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని రావులచెరువు సమీపంలో బాణ సంచా తయారు చేస్తున్న ఇంట్లో సోమవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పేలుడు ధాటికి భవనం పూర్తిగా నేలమట్టమైంది.

స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... దీపావళి నేపథ్యంలో రావులచెరువు సమీపంలో కొవ్వాల నాగేశ్వరరావు కుటుంబం రహస్యంగా బాణసంచాను తయారు చేస్తోంది. సోమవారం ఎప్పటిలాగే బాణసంచా పనిలో నిమగ్నమయ్యారు. ఆ సమయంలో ఇంట్లో కొవ్వాల నాగేశ్వరరావుతో పాటూ ఆయన భార్య కొవ్వాల నాగలక్ష్మి, కుమారుడు కొవ్వల రాజు, కుమార్తె కట్టా వేణు, మనువడు కట్టా వెంకట్, మనువరాలు మోహనప్రియ, స్థానికుడు చొల్లంగి సుబ్రహ్మణ్యం ఉన్నారు. ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు పటాస్ పౌడర్‌లో పడటంతో నిప్పంటుకుంది. గమనించిన వారు వెంటనే బయటకు పరుగులు తీస్తుండగానే పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. ఇంట్లో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు సైతం పేలడంతో భవనం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఏడుగురూ తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు తీవ్రతకు ఇంట్లో ఉన్న బైకులు పదిమీటర్ల దూరంలో ఎగిరిపడ్డాయి. పక్కనే ఉన్న రెండు భవనాలు కూడా దెబ్బతిన్నాయి. గాయపడ్డవారిని ఆమలాపురం ఏరియా, కిమ్స్ ఆస్పత్రులకు తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పట్టణ సిఐ వీరబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, సిపిఎం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరావు పరామర్శించారు. ఈ ప్రమాదానికి కారణాలు తెలిసిరాలేదు. నాగేశ్వరరావుకు చుట్టకాల్చే అలవాటు ఉందని, ఆ నిప్పురవ్వలు పడి ప్రమాదం సంభవించిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కూడా కారణమై ఉండొచ్చని, మెగ్నీషియం, పొటాష్ రాపిడి వల్ల కూడా మంటలు వ్యాపించే అవకాశం ఉందని అగ్నిమాపకశాఖ అధికారులు చెబుతున్నారు.



పేలుడుకు కుప్పకూలిన ఇల్లు

బాధితులకు రూ.10 లక్షల పరిహారమివ్వాలి : సిపిఎం

బాధితులకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని, పూర్తిగా శిథిలమైన ఇంటిని పునర్నిర్మించి ఇవ్వాలని మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను సిపిఎం బృందం కోరింది. పాక్షికంగా నష్టపోయిన ఇళ్లకూ పరిహారం ఇవ్వాలని కోరింది. విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి తెలిపారు. బృందంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అండ్ర మాల్యాద్రి, జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, నాయకులు మోహన్‌రావు ఉన్నారు.



వరద బాధితులకు అంగన్‌వాడీల సహాయం

వరద బాధితులకు అంగన్‌వాడీ ఉద్యోగులు ఆపన్నహస్తం అందించారు. విజయవాడలోని శ్రీశ్రీ భవన్‌లో నిత్యావసర వస్తువులు, బట్టలు పంపిణీ చేశారు.

ఘనంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వార్షికోత్సవ కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఆర్‌టిసిలో ఉద్యోగులు, కార్మికుల హక్కులతోపాటు ప్రజారవాణా వ్యవస్థ బలంగా వుండాలనే లక్ష్యంతో 1979లో సిఐటియుకు అనుబంధంగా ఏర్పాటైన ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆర్‌టిసి కార్మికుల అభిమానాన్ని చూరగొంది. ఎస్‌డబ్ల్యుఎఫ్ ఏర్పాటై 46ఏళ్ల అయిన సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ఆర్‌టిసి డిపోలలో ఆదివారం వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. డిపోల ఎదుట ఎస్‌డబ్ల్యుఎఫ్ జెండాను ఆవిష్కరించడంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, ప్రధాన కార్యదర్శి అయ్యపురెడ్డి మాట్లాడారు. ఎపిఎస్ ఆర్‌టిసిలో 1979కు ముందున్న రెండు ప్రధాన సంఘాలు సంఘం మనుగడ కోసమే ప్రయత్నించేవని అన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ ఏర్పాటయ్యాక ఆర్‌టిసి కార్మికుల హక్కుల కోసం ఐక్య ఉద్యమాలు మొదలయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వం ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశాక ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, యజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు ఎస్‌డబ్ల్యుఎఫ్ తీవ్ర కృషి చేసిందని తెలిపారు. ఇదే పోరాట స్ఫూర్తితో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాజీలేని పోరాటాలను చేపడుతుందని వివరించారు.

పేదల ప్రయోజనాలకు గండి

- సిబిఎస్ఇ రద్దుపై జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన సిబిఎస్ఇని రద్దు చేసి తాను పేదలకు వ్యతిరేకినని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరూపించుకున్నారని వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్టు చేశారు. పేదలకు నాణ్యమైన విద్యను అందకుండా చంద్రబాబునాయుడు గండికొడుతున్నారని ఈ పోస్టులో ఆయన పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ తిరోగమన నిర్ణయాలతో ప్రభుత్వ స్కూళ్లను మళ్లీ మొదటికే తీసుకెళ్తున్నారని విమర్శించారు. 'మీ ఇళ్లల్లో పిల్లలకు అత్యుత్తమ చదువులు అందించాలనుకుంటారు కానీ, ప్రభుత్వ స్కూలు పిల్లల విషయంలో వివక్ష ఎందుకు? వాళ్లు ఎప్పటికీ కింద స్థాయిలోనే ఉండిపోవాలా' అని ఆయన అని ప్రశ్నించారు.

జగన్ చెప్పడం వింతగా వుంది : నారా లోకేశ్

ఏమి చదివాడో, ఎక్కడ చదివాడో అసలు తెలియని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖ గురించి చెప్పడం వింతగా ఉందని మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ వేదికగా స్పందించారు. విద్యారంగంపై కనీస అవగాహన లేకుండా వైసిపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు శాపంగా మారిందని విమర్శించారు. సిబిఎస్ఇ విధానంలో పరీక్షలు రాయడానికి అవసరమైన సామర్థ్య పెంపు, ఉపాధ్యాయులకు ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే పరీక్షా విధానం మార్చడం కారణంగా పదో తరగతి చదువుతున్న 75 వేల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. ఆత్మలతో కాకుండా నిపుణులతో చర్చించి వచ్చే విద్యా సంవత్సరం 6వ తరగతి నుంచే పరీక్షా విధానంలో మార్పులు తీసుకొచ్చి. సిబిఎస్ఇలో పరీక్షలు రాసేందుకు విద్యార్థులను సిద్ధం చేస్తామని తెలిపారు.

గ్రంథాలయాల నిర్వహణ సమయం మార్చండి

- డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రంథాలయాల నిర్వహణా సమయం మార్చాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాము, జి.రామన్నలు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు సాయంత్రం 4గంటల నుంచి 7 గంటల వరకు ప్రస్తుతం రాష్ట్రంలో గ్రంథాలయాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఆయా సమయాలు విద్యార్థులు, నిరుద్యోగులకు అనుకూలంగా లేవని పేర్కొన్నారు. గ్రంథాలయాల సమయాన్ని ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహణా సమయం మార్చాలని, మధ్యాహ్నం 12 గంటల నుంచి 3గంటల వరకు భోజన విరామసమయం ఇవ్వాలని డివైఎఫ్ఐ ప్రభుత్వానికి సూచించింది.

పెడనలో ఉద్రిక్తత

- ఘర్షణలో నలుగురికి గాయాలు, ఫర్నీచర్ ధ్వంసం
- భారీగా పోలీస్ బందోబస్తు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి, పెడన

కృష్ణా జిల్లా పెడన పట్టణంలో ఉద్రిక్తత నెలకొంది. ఆదివారం రాత్రి రెండు మతాల వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో, నలుగురికి గాయాలయ్యాయి. ఓ వ్యక్తి ఇంటి ఫర్నీచర్ ధ్వంసమైంది. ఈ నేపథ్యంలో సోమవారం రెండు వైపులకు చెందిన వారు ర్యాలీలకు పూనుకోవడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది. స్థానికుల కథనం ప్రకారం... పెడన బస్టాండ్ సెంటర్ జగపతి థియేటర్ రోడ్లో పది రోజులుగా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. తోరణాలు, జెండాలతో ఆ ప్రాంతాన్ని అలంకరించారు. సోమవారం మరో మతానికి చెందిన వారి పండగ కూడా ఉండడంతో ఆదివారం రాత్రి అదే రోడ్లో ఆలయం ప్రాంతంలో వారూ తోరణాలు, జెండాలు కట్టడానికి పూనుకున్నారు. దీనిపై కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేసినా వాటిని కట్టారు. అక్కడే టపాసులు కాల్చారు. ఈ నేపథ్యంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరువైపుల వారు ఘర్షణకు దిగారు. ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకోవడంతో నలుగురు గాయపడ్డారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. రెండు మతాలకు చెందిన వారు సోమవారం ర్యాలీలు నిర్వహించుకునేందుకు పోలీసులు అనుమతించారు. పరస్పర ర్యాలీలతో పెడనలో ఉద్రిక్తత కొనసాగుతోంది. ఎస్‌పి గంగాధరరావు, అడిషనల్ ఎస్‌పి టివిడి ప్రసాద్ పర్యవేక్షణలో పెడనలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పెడనలో ఉద్రిక్తత నెలకొన్న దృశ్యం

'ఉక్కు'పై కుట్రల పరంపర

(మొదటి పేజీ తరువాయి

చేశామని, డిజిన్వెస్ట్‌మెంట్ కచ్చితంగా చేస్తామని బదులిచ్చారు. ఈ విషయాన్ని ఆలస్యంగా లేఖ ద్వారా గొల్ల బాబూరావుకు ఈ నెల పదిన రాజ్యసభ నుంచి పంపారు. బాబూరావు సోమవారం ఈ విషయాన్ని మీడియా ఎదుట వెల్లడించారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆగే పరిస్థితి కనిపించడం లేదని, పరిశ్రమపై లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

అమరావతిలో నిర్మాణాలు పదిలం

(మొదటి పేజీ తరువాయి

డిజైన్ చేసే సమయంలోనే ఇబ్బంది లేకుండా కాల్వలు, రిజర్వాయర్ల ప్రాతిపాదన చేశామని, కొండవీటివాగు, పాలవాగుతో గ్రావిటీ కెనాల్స్ డిజైన్ చేశామని పేర్కొన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి వీటిని పూర్తి చేసేలా టెండర్లు పిలుస్తామని పేర్కొన్నారు. అనంతవరం నుండి ఉండవల్లి వరకూ 23.6 కిలోమీటర్ల కొండవీటివాగు, దొండపాడు నుండి కృష్ణాయపాలెం వరకూ 16.7 కిలోమీటర్ల మేర పాలవాగు, వైకుంఠపురం నుండి ఎనిమిది కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ మొత్తం 48.3 కిలోమీటర్ల మేర మూడు కాలువలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆరు రిజర్వాయర్ల నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. సీడ్ క్యాపిటల్ పరిధిలోకి వచ్చే నీరుకొండ వద్ద 0.4 టిఎంసిలు, కృష్ణాయపాలెం వద్ద 0.1 టిఎంసి, శాఖమూరు వద్ద 0.01 టిఎంసిల సామర్థ్యంతోనూ, సీడ్ క్యాపిటల్ వెలుపల లాం వద్ద 0.3 టిఎంసిలు, పెదపరిమి వద్ద 0.2 టిఎంసిలు, వైకుంఠపురం వద్ద 0.3 టిఎంసిల సామర్థ్యంతో రిజర్వాయర్ల నిర్మాణం చేపడతామని వివరించారు. ఎంత వర్షం వచ్చినా కాలువలు రిజర్వాయర్లు సరిపోతాయని, నగరం ముంపునకు గురికాదని వివరించారు. ఒకవేళ రిజర్వాయర్లు నిండితే 12,350 క్యూసెక్కుల కెపాసిటీతో ఉండవల్లి వద్ద లిఫ్టు ఉందని, దీంతోపాటు 4.000 క్యూసెక్కులు బకింగ్‌హాం కెనాల్‌లోకి మళ్లించొచ్చని తెలిపారు. ఇవి కాకుండా 5,650 క్యూసెక్కుల నీటిని తరలించేందుకు వైకుంఠపురం వద్ద లిఫ్టు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే కృష్ణానదికి 15 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా తట్టుకునేలా కరకట్టను రీడిజైన్ చేస్తామని పేర్కొన్నారు. అమరావతి మునుగుతుందని వైసిపి నాయకులు చేసే ప్రచారాలను నమ్మవద్దని ఆయన అన్నారు.

వైద్య విద్య ప్రైవేటీకరణకు ప్రభుత్వం కుట్ర

- విశాఖ ఉక్కుపై చంద్రబాబు, పవన్ కేంద్రాన్ని నిలదీయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వైద్య విద్యను ప్రైవేటీకరించేందుకు రాష్ట్రప్రభుత్వం కుట్ర చేస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య విద్యలో రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన దానికి అధికారంలోకి వచ్చిన తరువాత చెప్పే మాటలకు పొంతన లేదని తెలిపారు. జగన్ తెచ్చిన 107, 108 జిఓలను తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని లోకేష్ పాదయాత్రలో చెప్పారని, కానీ చేయలేదని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీని వెనక్కు తీసుకున్నట్లు కనబడుతుందని అన్నారు. రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లలో ఉత్పత్తి ఆపేశారని వివరించారు. టాటా స్టీలు కంటే ప్రత్యేకత కలిగిన విశాఖ ఉక్కును నష్టాలబాట పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై చిత్తశుద్ధి ఉంటే కేంద్రాన్ని నిలదీయాలని, కేంద్రం వినకపోతే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రభుత్వం నుండి బయటకు రావాలని తెలిపారు. ప్రభుత్వాలు మారినా ఉద్యోగ సంఘాలు, వాటి నాయకుల తీరు మారడం లేదని అన్నారు. పోలీసులు ఖాకీ దుస్తులు ధరించి చంద్రబాబు, కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పూలమాల వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. గతంలోనూ పోలీసు ఉన్నతాధికారులు ఇలాగే చేసి సస్పెండ్ అయ్యారని, అది ప్రస్తుత అధికారులకు గుణపాఠం కావాలని అన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు వ్యక్తిత్వంతో బతకాలని, బాధ్యతగా ఉండాలని తెలిపారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, నాయకులు జి.ఈశ్వరయ్య, అక్కినేని వనజ తదితరులు పాల్గొన్నారు.

సౌర విప్లవంలో సువర్ణాధ్యాయం

(మొదటి పేజీ తరువాయి

పారిశ్రామిక వేత్తలకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయన వివరించారు. అనంతరం మాట్లాడుతూ 2030 నాటికి 72.60 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడం వల్ల ఉద్యోగ ఉపాధికల్పన తోపాటు, తక్కువ ధరకే విద్యుత్తు అందుబాటులోకి వస్తుందన్నారు. దీనితో పాటు పర్యావరణ పరిరక్షణలో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందన్నారు.

సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ అండ్ గ్రీన్‌హైడ్రోజన్‌లో రాష్ట్రం విస్తారమైన సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. నైపుణ్యం కలిగిన వర్క్ ఫోర్స్‌తో పాటు పన్ను మినహాయింపులు, రాయితీలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సులభతరమైన నిబంధనలతో రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల కోసం 500 మెగావాట్ల పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 4335.28 మెగావాట్ల సోలార్, 4083.57 మెగావాట్ల పవన విద్యుత్తు, 443 మెగావాట్ల బయో ఎనర్జీ, 36 మెగావాట్ల వేస్ట్ టు ఎనర్జీ ఉత్పత్తి ఉందన్నారు. అనంతపురం, కర్నూలు, కడపజిల్లాల్లో దాదాపు 4వేల మెగావాట్ల సోలార్ పవర్ పార్కులను ఏర్పాటు చేశామన్నారు. ప్రకాశం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మరో 2700 మెగావాట్ల సోలార్ సామర్థ్యం పార్కులు రానున్నాయని చంద్రబాబు తెలిపారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి, రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు.

గాందీనగర్ దండి కుటీర్‌ను సందర్శించిన చంద్రబాబు:

గాంధీనగర్‌లోని దండి కుటీర్‌ను చంద్రబాబునాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా గాంధీజిని స్మరించుకుని నివాళులు అర్పించారు. అనంతరం సందర్శకుల పుస్తకంలో ఈ సందర్శన తన జీవితంలో మరపురాని ఘటనగా ఉండిపోతుందని రాశారు.



డ్రైడే పాటించండి

- ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం షాపులు నడపాలి
- నూతన మద్యం పాలసీపై మహిళా సంఘాల ఐక్యవేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మద్యపానాన్ని నియంత్రించడంలో భాగంగా రాష్ట్రప్రభుత్వం కనీసం వారంలో ఒక రోజును డ్రైడేగా ప్రకటించి అమ్మకాలను పూర్తిగా నిలిపివేయాలని మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. రాష్ట్రప్రభుత్వం మద్యం షాపులను ప్రైవేట్‌వారికి కాకుండా ఇప్పుడున్న తరహాలో ప్రభుత్వమే నిర్వహించాలని కోరింది. ఈ నెల 18న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో మద్యం పాలసీపై నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో మహిళా సంఘాల ఐక్యవేదిక పలు ప్రతిపాదనలను రాష్ట్రప్రభుత్వం ముందుంచింది. ఈ మేరకు మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులు డి రమాదేవి, సుంకర పద్మశ్రీ, పి దుర్గాభవాని, పి పద్మ, ఎస్ విష్ణు తదితరులు డిమాండ్స్ కూడిన కరపత్రాన్ని సోమవారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం మద్యపాన నిషేదాన్ని అమలు చేస్తామని మాట తప్పిందన్నారు. గత ప్రభుత్వం మద్యపాన నిషేదాన్ని అమలు చేయకపోగా, నాణ్యతలేని మద్యాన్ని అమ్మడం వల్ల అనారోగ్యంపాలై దాదాపు 30వేల మంది మరణించారని తెలుగుదేశం పేర్కొందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని బాధ్యతలేని ప్రకటన చేశారని, నాణ్యత కూడిన మద్యం ఆరోగ్యాన్ని, ప్రజల ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేయదా? అని ప్రశ్నించారు. మద్యపానంపై నియంత్రణ కోల్పోవడం వల్లే ప్రజల్లో నేర ప్రవృత్తి బాగా పెరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందిస్తున్న మద్యం పాలసీలో మద్యం నియంత్రణకు అవకాశం వుండేలా చూడాలని డిమాండ్ చేశారు. మద్యం షాపులను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు దక్కించుకోకుండా సాంప్రదాయ వ్యాపారులు మాత్రమే తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. బెల్ట్ షాపులు లేకుండా చూడాలన్నారు. గుడి, బడి, బస్టాండ్‌లకు దూరంగా మద్యం షాపులు వుండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మద్యం ద్వారా వచ్చే ఆదాయంలో రెండు శాతాన్ని మద్యపానంతో వచ్చే నష్టాలకు సంబంధించి ప్రచారాలను చేయాలన్నారు. ప్రతి పిహెచ్‌సి పరిధిలో డీ ఎడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. తాగుడు కారణంతో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా అమ్మకాలు తగ్గించడం, షాపుల కుదింపు, ఆదాయాన్ని తగ్గించుకునే లక్ష్యంతో నూతన మద్యం పాలసీని రూపొందించాలని అన్నారు.

త్వరలో విశాఖ రైల్వేజోన్‌కు భూమిపూజ

- విశాఖపట్నం - దుర్గ్ వందే భారత్ రైలు ప్రారంభంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



విశాఖ నుంచి దుర్గ్‌కు ప్రారంభమైన వందే భారత్ రైలు

విశాఖ రైల్వేజోన్‌కు సంబంధించి రైల్వే శాఖకు ఇవ్వాల్సిన భూమిని ఇప్పటికే కేటాయించామని, దసరా లేదా దీపావళి సమయంలో భూమి పూజ నిర్వహిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. విశాఖపట్నం - దుర్గ్ (రాయపూర్) వందే భారత్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం మధ్యాహ్నం అహ్మదాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా పలు కొత్త ప్రాజెక్టులకు ఆయన వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ఇండియన్ రైల్వే మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వాల్తేరు రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విశాఖపట్నం - దుర్గ్ వందేభారత్ రైలు ప్రారంభ వేడుకలు ఘనంగా సాగాయి. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు రైలును ప్రారంభిస్తూ మాట్లాడారు. దేశంలో 61 వందేభారత్ రైళ్లు నడుస్తుండగా ఫుల్ ఆక్యుపెన్సీతో విశాఖపట్నం - సికింద్రాబాద్ వందే భారత్ రైలు నడుస్తున్నట్టు తెలిపారు. త్వరలో వందే భారత్ స్లీపర్ రైళ్లను కూడా ప్రవేశపెట్టనున్నామన్నారు. వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరవ్ ప్రసాద్ మాట్లాడుతూ.. వాల్తేరు రైల్వే డివిజన్‌లో ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఈ రైలును నడపాలని నిర్ణయించిందన్నారు. ఈ రైలు ద్వారా ఆంధ్రప్రదేశ్ - ఒడిశా - ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజల రవాణా సౌకర్యాలు మెరుగవుతాయని తెలిపారు. నూతన వందే భారత్ రైలు రెండు ఎగ్జిక్యూటివ్ కోచ్‌లు, 14 చైర్ కార్ కోచ్‌లతో నడవనుందన్నారు. విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ.. ఈ రైలు ద్వారా టూరిజం, వాణిజ్య కార్యకలాపాలను మెరుగుపరచాలన్నది తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, విశాఖ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యేలు గణబాబు, విష్ణుకుమార్ రాజు, పల్లా శ్రీనివాసరావు, బి.విజయచంద్ర, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు.

పోలీసుల తీరు అమానుషం

- ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని బాధితుల డిమాండ్

ప్రజాశక్తి- నెల్లూరు

తమను అమానుషంగా కొట్టిన పోలీసులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలానికి చెందిన దళితులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ముత్తుకూరు ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన వారమని, విద్యార్థుల మధ్య ఏర్పడిన వివాదంలో తమ కుటుంబ సభ్యులైన అమావాస్య హరీష్, సందీప్‌తో పాటు నలుగురిని ముత్తుకూరు ఎస్ఐ విశ్వనాథరెడ్డి, కానిస్టేబుల్ సుమన్ దారుణంగా కొట్టి గాయపరిచారని వాపోయారు. తమ కుటుంబ సభ్యులను ముత్తుకూరు, వెంకటాచలం పోలీస్ స్టేషన్లో నిర్బంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. దళిత నేతనంటూ చెప్పుకుంటున్న చాట్ల వెంకటసుబ్బయ్య తన స్వలాభం కోసం పార్టీలు మారుతున్నారని, దళితులకు అన్యాయం జరిగితే ప్రశ్నించాల్సిందిపోయి, తప్పు చేసిన వారికి వత్తాసు పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై జరిగిన దాడిని తెలుసుకొని పరామర్శించేందుకు వెళ్లిన దళిత నాయకులైన కొప్పోలు రఘు, వదనాల వెంకటరమణలను తప్పుపట్టే అర్హత చాట్ల వెంకటసుబ్బయ్యకు లేదన్నారు. ఈ వ్యవహారంపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని తెలిపారు. ముత్తుకూరు, వెంకటాచలం పోలీస్ స్టేషన్ సిఐ, ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలని కోరామని చెప్పారు. పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడి ఇంట్లో ఉన్న తమ కుటుంబ సభ్యులకు వెంటనే మెరుగైన వైద్య చికిత్స అందించాలని, ఈ ఘటనపై సమగ్రంగా విచారణ జరపాలని వారు కోరారు. ఈ సమావేశంలో బాధిత మహిళ కుటుంబ సభ్యులైన అను, పద్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

మహీంద్రా ఇ కొత్త ఎల్‌సివి వీరో

- ప్రారంభ ధర రూ.7.99 లక్షలు

ముంబయి : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ మహీంద్రా లిమిటెడ్ కొత్తగా తేలికపాటి వాణిజ్య వాహనం (ఎల్‌సివి)లో వీరోను విడుదల చేసింది. డీజిల్, సిఎన్‌జిలో మూడు రకాల వేరియంట్లను సోమవారం ఆవిష్కరించింది. వీటి ధరల శ్రేణీని రూ.7.99 లక్షల నుంచి రూ.9.56 లక్షలుగా నిర్ణయించింది. ఈ సందర్భంగా మహీంద్రా ఆటోమోటివ్ డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ నక్రా మాట్లాడుతూ.. డ్రైవర్లకు ఇది అత్యంత సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఎల్‌సివి ఎయిర్ బ్యాగ్, ఎసి, సహా మొబైల్ సర్జింగ్, 26.03 సెంటీమీటర్ల స్మార్ట్ డిస్‌ప్లే, రివర్స్ పార్కింగ్ కెమెరా, ఉంటుందన్నారు. డ్రైవర్ అలసిపోయినప్పుడు నిద్రించడానికి పోల్డేబుల్ సీట్‌ను డిజైన్ చేశామన్నారు. 1600 కిలోల పేలోడ్ సామర్థ్యం కలిగిన ఈ వాహనంలో డీజిల్ వేరియంట్ లీటర్‌కు 18.4 కిలోమీటర్లు, సిఎన్‌జి 19.2 కిలోమీటర్ల మైలేజీ అందిస్తుందన్నారు. ఇందులో విద్యుత్ వాహన వేరియంట్‌ను కూడా అందుబాటులోకి తేనున్నామన్నారు. వీరోను ముఖ్యంగా పట్టణ ప్రాంత రవాణకు అనుగుణంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇది తమ కంపెనీ వాహన అమ్మకాలను మరింత పెంచనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

రాజనీతిజ్ఞులు సీతారాం ఏచూరి

- ఎంపి లావు శ్రీ కృష్ణదేవరాయలు


సంతాప సభలో మాట్లాడుతున్న ఎంపి శ్రీకృష్ణదేవరాయలు, వేదికపై లక్ష్మణరావు, జె.డి. శీలం తదితరులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి
భావ వ్యక్తీకరణ, స్వేచ్ఛ, ప్రజాస్వామ్య పరిరక్షణకు సైద్ధాంతిక సిద్ధాంతాలతో పోరాడిన గొప్ప రాజనీతిజ్ఞుడు సీతారాం ఏచూరిని కోల్పోవడం బాధాకరమని నరసరావుపేట ఎంపి లావు శ్రీ కృష్ణదేవరాయలు అన్నారు. గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో జరిగిన సీతారాం ఏచూరి సంస్మరణ సభలో ఆయన ప్రసంగిస్తూ.. విద్యార్థి యూనియన్ అధ్యక్షులుగా రాజకీయాలలో ప్రవేశించి అంచెలంచెలుగా ఎదిగి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)కి జాతీయ ప్రధాన కార్యదర్శిగా మూడుసార్లు ఎన్నిక కావడం గొప్ప విషయమన్నారు. శాసన మండలి సభ్యులు కెఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ.. 1977 నుంచి 2024 మధ్య భారత రాజకీయాలలో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. కామన్ మినిమమ్ ప్రోగ్రాం రూపకల్పనలో కీలక భూమిక పోషించారని, 2004లో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ప్రజలకు తోడ్పడే అనేక చట్టాల రూపకల్పనకు కృషి చేశారని వివరించారు.

మతతత్వ ధోరణులపై రాజీలేని పోరాటం చేశారన్నారు. కేంద్ర మాజీ మంత్రి జె.డి. శీలం ప్రసంగిస్తూ.. సీతారాం ఏచూరితో కలిసి రాజ్యసభలో 11 సంవత్సరాల పాటు రాజకీయ, ఆర్థిక, సామాజిక విషయాలపై చర్చించామని వారితో గుర్తు చేసుకున్నారు. 2004 కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉపాధి హామీ చట్టం, విద్య హక్కు, సమాచార హక్కు, అటవీ హక్కు లాంటి చట్టాల రూపకల్పనలో సీతారాం ఏచూరి ప్రముఖ పాత్ర పోషించారన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ ..వామపక్షాల ఐక్యత కోసం కృషి చేస్తూనే దళిత, గిరిజన, బలహీన వర్గాల హక్కులను కాపాడడంలో అగ్రభాగాన ఉండేవారని చెప్పారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ.. భారతదేశంలో లౌకికవాదం, ఫెడరలిజం, ప్రజాస్వామ్య విలువల కోసం ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ పోరాటాన్ని సీతారాం ఏచూరి నిర్వహించారన్నారు. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు లింగం శెట్టి ఈశ్వరరావు, జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షులు సిరిపురపు శ్రీధర్ శర్మ తదితరులు నివాళులర్పించారు.

వృద్ధుడి సజీవదహనం

ప్రజాశక్తి-శృంగవరపుకోట (విజయనగరం జిల్లా)


చిన్న నాగు (ఫైల్)

విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం ధర్మవరం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో ఓ వృద్ధుడు సజీవ దహనమయ్యారు. శృంగవరపుకోట సిఐ వి.నారాయణమూర్తి కథనం ప్రకారం... ధర్మవరం గ్రామానికి చెందిన పెంట చిన్ననాగు (74) తన భార్య సూర్యుడమ్మతో కలిసి జీవిస్తున్నారు. శనివారం రాత్రి తన దూలంలోని ప్లాస్టిక్ మంచంపై కూర్చొని బీడీ తాగారు. అనంతరం అలాగే నిద్రపోయారు. అయితే బీడీ నిప్పు రవ్వలు మంచానికి అంటుకోవడంతో మంటలు వ్యాపించాయి. గదిలో నుంచి బయటకు రాలేక తీవ్రంగా గాయాలతో అక్కడికక్కడే మరణించారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్ననాగు భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ఫ్‌ఫైనాన్స్ సీట్ల రద్దు హామీ ఏమైంది

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ సరికాదు
సిఎం చంద్రబాబునాయుడికి ఎస్ఎఫ్ఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలలో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లను రద్దు చేస్తామని తెలుగుదేశం కూటమి ఇచ్చిన హామీని విస్మరించి, మొత్తం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసేలా చర్యలు తీసుకోవడం సరైంది కాదని ఎస్ఎఫ్ఐ పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ తరుపున రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ప్రసన్నకుమార్, ఎ అశోక్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి లేఖ రాశారు. గత వైసిపి ప్రభుత్వం మెడికల్ కాలేజీలలో ప్రవేశపెట్టిన సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులను వంద రోజుల్లో రద్దు చేస్తామని చెప్పి, ఇప్పుడు ఆ వైపుగా చర్యలు తీసుకోకుండా చంద్రబాబు ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా మెడికల్ కాలేజీల అంశంలో వ్యవహరిస్తోందని విమర్శించారు. పులివెందుల మెడికల్ కాలేజీకి కేటాయించిన ఎంబిబిఎస్ సీట్లను వద్దని లేఖ రాయడం ఏమిటని ప్రశ్నించారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వల్ల రాష్ట్రం 700 మెడికల్ సీట్లను కోల్పోయిందని వివరించారు. కూటమి అధికారంలోకి వస్తే మెడికల్ సీట్లన్నీ ఫ్రీ అని ఇప్పుడు ఏకంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలనే ప్రైవేట్‌కు అమ్మేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రాష్ట్రంలో నిర్మాణంలో వున్న మెడికల్ కాలేజీల నిర్మాణాలను పూర్తి చేసి వైద్యవిద్యను ప్రైవేట్‌పరం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు.

ఎస్‌సి వర్గీకరణ జోలికొస్తే బుద్ధి చెబుతాం

- రాయలసీమ మాలమహానాడు జాతీయ అధ్యక్షులు అరుణ్

ప్రజాశక్తి - కడప అర్బన్
ఎస్‌సి వర్గీకరణ జోలికొస్తే టిడిపి, బిజెపిలకు బుద్ధి చెబుతామని రాయలసీమ మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్ కుమార్ పేర్కొన్నారు. వైఎస్ఆర్ జిల్లా ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఏడుగురు జడ్జీలతో కూడిన కమిటీ ఇచ్చిన తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ఎస్‌సి రిజర్వేషన్లను ఎత్తివేయడానికి కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. జనాభా ప్రాతిపదికన ఎస్‌సి రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి వర్గీకరణ విషయంలో ఏకపక్ష నిర్ణయం తీసుకుంటే న్యాయ వ్యవస్థ మీద ప్రజల్లో విశ్వాసం కోల్పోతుందని పేర్కొన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనా విధానానికి తూట్లు పొడిస్తే ప్రజా క్షేత్రంలో న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. ఎస్‌సి వర్గీకరణకు ఏ పార్టీ మద్దతు తెలిపినా ఆ పార్టీకి బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో రాయలసీమ ఇన్‌ఛార్జ్ మిట్టా సునీత కుమారి, రాష్ట్ర కార్యదర్శి సాతిరి లక్ష్మయ్య, జిల్లా అధ్యక్షులు నర్రా వెంకట సుబ్బయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మొలక గోపాల్, జిల్లా ఆర్గనైజర్ పందిటి రవికుమార్ పాల్గొన్నారు.

సాయం పరిమితి పెంచాలి

- ముంపు పొలాల నష్టగణన సక్రమంగా చేయాలి
- రైతు, కౌలు రైతు సంఘాల రాష్ట్ర నేతలు డిమాండ్
- బుడమేరు, ఏలూరు కాల్వ ముంపు ప్రాంతాల్లో పర్యటన


కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలంలో ముంపునకు గురైన పొలాలను పరిశీలిస్తున్న రైతు రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు తదితరులు

ప్రజాశక్తి - గన్నవరం, ఉంగుటూరు, గుడివాడ :
బుడమేరు, ఏలూరు కాల్వ ముంపు నష్టాలపై నష్టగణన సక్రమంగా జరగలేదని, ప్రభుత్వం ప్రకటించిన రూ.పది వేల సాయం ఏమాత్రమూ చాలదని ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘాల రాష్ట్ర, జిల్లా నేతల బృందం పేర్కొంది. ఈ నేపథ్యంలో నష్ట పరిహారాన్ని రూ.25 వేలకు పెంచాలని డిమాండ్ చేసింది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి వద్ద ఏలూరు కాల్వకు గండి పడిన ప్రాంతాన్ని, గండి కారణంగా నీట మునిగిన పొలాలను రైతు, కౌలు రైతు సంఘాల నేతల బృందం సోమవారం పరిశీలించింది. గండిని పూడ్చకపోవడంతో ఇంకా మునుగుతున్న పొలాలనూ పరిశీలించింది. అలాగే గన్నవరం నియోజకవర్గం బుడమేరు పరిధిలోని వెల్దిపాడు, ఎలకపాడు, ఉంగుటూరు, కొయ్యగూరపాడు, ఒంద్రపాడు, ఆముదాలపల్లి, చేగుర్తిపాడు, కండ్రిక, పుట్టగుంట, మోపర్రు, జొన్నపాడు, తుమ్మలపల్లి, పెదలింగాల, ఓగిరాల, ఆరుగొలను, అరిపిరాల, కొరిపిరాల గ్రామాలతోపాటు గుడివాడ నియోజకవర్గంలోని నందివాడ మండలంలోని బుడమేరు ముంపు పొలాలను, ఆక్వా చెరువులను పరిశీలించింది. బాధిత రైతులతో బృందం నేతలు మాట్లాడారు. అనంతరం బృందం నేతలు గన్నవరం, గుడివాడల్లో మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో ఎపి రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై కేశవరావు, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, ఆయా సంఘాల జిల్లా జిల్లా కార్యదర్శులు పంచకర్ల రంగారావు, గౌరిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిఓ నంబర్ 3
చట్టబద్ధతపై ఆర్డినెన్స్


- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)
ఈ నెల 18న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జిఓ నంబర్ - 3 చట్టబద్ధతపై ఆర్డినెన్సు తీసుకురావాలని, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, అల్లూరి జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్, జిల్లా నాయకులు పాలికి లక్కు డిమాండ్ చేశారు. సోమవారం పాడేరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ .. ఆదివాసీ దినోత్సవం రోజున జిఓ నంబర్ 3పై చంద్రబాబు స్పందిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున తాను మాట్లాడలేకపోతున్నానని, ఎన్నికల కోడ్ అనంతరం స్పష్టమైన ప్రకటన చేస్తానని అన్నారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఆ మాటకు కట్టుబడి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడిచినా జిఓ నంబర్-3పైనా, స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్‌పైనా ఎటువంటి చర్యలూ చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి కోసం గిరిజన యువత ఎదురు చూస్తోందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఐటిడిఎ పరిధిలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని, గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పంచాయతీలను బలోపేతం చేయండి

- అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అశోక్ జాడౌన్


సమావేశంలో మాట్లాడుతున్న అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అశోక్ జాడౌన్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి
దేశంలో పంచాయతీలను బలోపేతం చేయాలని, శాసన మండలి ఎన్నికల్లో సర్పంచ్‌లకూ ఓటు కల్పించాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అశోక్ జాడౌన్ డిమాండ్ చేశారు. గుంటూరులోని సర్పంచుల అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల నుంచి శాసన మండలికి జరిగే ఎన్నికల్లో ఎంపిటిసి సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లతోపాటు సర్పంచులకీ ఓటు హక్కు ఇవ్వాలన్నారు. రాజ్యాంగ సవరణ ప్రకారం సర్పంచులకు అధికారాలను బదలాయించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన వరదలను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని, తక్షణం రాష్ట్రానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కేంద్ర పెద్దల దృష్టికి వరద బాధితుల సమస్యలను తీసుకెళ్తానని తెలిపారు. సర్పంచులు, స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రమాదవశాస్తూ మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.20 లక్షల బీమా ఇవ్వాలని కోరారు. ఒకే రోజు 13 వేల గ్రామపంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి కె పవన్ కల్యాణ్ వరల్డ్ రికార్డు సాధించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రం నుంచి మరిన్ని సహాయ చర్యలకు అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) ద్వారా కృషి చేస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ అధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, సర్పంచ్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ అల్లాబక్షు, పంచాయతీ పరిషత్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గోళ్ల మాల్యాద్రి నాయుడు, సర్పంచులు పాల్గొన్నారు.

స్నేహపూర్వక వాతావరణంలో రిజిస్ట్రేషన్ సేవలు

- ఆర్‌పి సిసోడియా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖల ద్వారా ప్రజలకు మరింత స్నేహ పూర్వక వాతావరణంలో రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించడమే తమ ధ్యేయమని రెవెన్యూ స్పెషల్ సిఎస్ ఆర్ పి సిసోడియా పేర్కొన్నారు. విజయవాడ గుణదల రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సోమవారం సబ్ రిజిస్ట్రార్ పోడియం తొలగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిసోడియా మీడియాతో మాట్లాడుతూ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రార్ పోడియం చూస్తే ప్రజలకు కోర్టులో ఉన్నామనే భావన కలగకుండా ఉండేందుకే ఇటువంటి మార్పులు తీసుకువస్తున్నామన్నారు. బ్రిటీష్ ప్రభుత్వ కాలం నుంచి కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాచరిక పోకడలు నేటికీ కొనసాగుతున్నాయన్నారు. క్రయ విక్రయదారులకు మంచి మర్యాద పూర్వకమైన సేవలను పొందగలుగుతున్నామనే భావన కల్పించడమే లక్ష్యమని చెప్పారు. ఈ ప్రక్రియను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అత్యంత పారదర్శకతను పాటించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రెవెన్యూ స్పెషల్ సిఎస్ ఆర్‌పి సిసోడియా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజి ఎంవి శేషగిరి బాబు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, గుణదల జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు కె.ప్రసాదరావు, ఎం.కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్‌శాఖ ప్రపంచ రికార్డు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు23న (ఒకే రోజు) 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించినందుకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖకు ప్రపంచ రికార్డు దక్కింది. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ బాధ్యతలు చేపట్టిన 100 రోజులలోపే ఆయన నిర్వహిస్తున్న శాఖ ఈ రికార్డు సాధించింది. ఇందుకు సంబంధించిన రికార్డు పత్రం, మెడల్‌ను హైదరాబాద్‌లో సోమవారం ఉదయం డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు వరల్డ్ రికార్డ్సు యూనియన్ అఫీషియల్ రికార్డ్స్ మేనేజరు క్రిస్టఫర్ టేలర్ క్రాఫ్ట్ అందజేశారు. ఒకే రోజు ఈ స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో సభలు నిర్వహించడం అతి పెద్ద గ్రామ పాలనగా గుర్తిస్తున్నట్లు ఆయన తెలిపారు

యూనియన్ బ్యాంక్ ఆకర్షణీయ ఎఫ్‌డి ప్లాన్

హైదరాబాద్ : ప్రభుత్వ రంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ) ఖాతాదారుల నుంచి డిపాజిట్లను ఆకర్షించడానికి కొత్త ప్లాన్‌ను ఆవిష్కరించింది. 333 రోజుల కాలపరిమితితో యూనియన్ సమృద్ధి స్కీంను ప్రవేశపెట్టింది. ఇందులో కనీసంగా రూ.1,000 నుంచి రూ.3 కోట్ల లోపు డిపాజిట్ చేయడానికి వీలుంది. ఈ స్కీంపై సాధారణ ప్రజలకు 7.40 శాతం వార్షిక వడ్డీని చెల్లించనుంది. సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.15 శాతం వడ్డీని అందిస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ తెలిపింది. ఎఫ్‌డి కాలపరిమితి ముగియక ముందే ఉపసంహరించు కోవడానికి వీలుంది. అయితే మధ్యంతరంగా ఎఫ్‌డిని ఉపసంహరించుకుంటే ఒక్క శాతం వడ్డీని తగ్గించుకోని చెల్లించనుంది. తమ అన్ని శాఖల్లోనూ సమృద్ధి స్కీం పథకం అందుబాటులో ఉంటుందని ఆ బ్యాంక్ తెలిపింది.

సంపాదకీయం

'పంజరంలో చిలుక'

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ సందర్భంగా కేంద్ర నేర పరిశోధన సంస్థ (సిబిఐ)పై కేంద్ర ప్రభుత్వ రాజకీయ ప్రభావం మరో మారు చర్చకొచ్చింది. శుక్రవారం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసే ఉత్తర్వుల్లో దేశ సర్వోన్నత న్యాయస్థానం సిబిఐనుద్దేశించి వెలిబుచ్చిన ఆగ్రహం దిగజారిన ఆ సంస్థ పనితీరును తెలియజేస్తుంది. ప్రతిపక్ష నేతలపై రాజకీయ కక్షతో మోడీ ప్రభుత్వం సిబిఐ, ఇ.డి వంటి దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతోందని ఆందోళన చెందుతుంటే, వాటిని ప్రత్యర్థి పార్టీల రాజకీయ ఆరోపణలుగా బిజెపి తోసిపుచ్చింది. స్వయాన సుప్రీం కోర్టే ఆ మాటంటుంటే బిజెపి ఏం సమాధానం చెబుతుంది? దేశంలోనే సిబిఐ అనేది అత్యున్నత నేర పరిశోధన సంస్థ అని, అలాంటి సంస్థ మిగతా సంస్థల కంటే అత్యున్నతంగా వ్యవహరించాల్సి ఉంటుందని సుప్రీం సిబిఐకి గడ్డి పెట్టడంలో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. ఎందుకంటే, కేంద్రంలో బిజెపి వచ్చాక సిబిఐ పరిశోధిస్తున్న కేసులు, ప్రతిపక్ష నేతల అక్రమ నిర్బంధాలతో సిబిఐ కేంద్ర ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లో పని చేస్తోందని ఎవరికైనా అర్థమవుతుంది. అందుకే పంజరంలో బంధింపబడిన చిలుక అనే భావన కలగకుండా చూసుకోవాలని సుప్రీం సిబిఐకి తలంటింది.

కేజ్రీవాల్ కేసునే చూసుకుంటే ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అవకతవకలు జరిగాయని, అక్రమంగా డబ్బులు చేతులు మారాయన్న అభియోగాలపై మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసింది. ఆ నాటి నుంచి ఆరు నెలలుగా ఆయన జైలులోనే ఉన్నారు. ఎన్నికల ప్రచారం కోసం మధ్యలో మూడు వారాల మధ్యంతర బెయిల్ వచ్చింది. కాగా ఇ.డి కేసులో సుప్రీం నుంచి బెయిల్ మంజూరైన సమయాన, కస్టడీలో ఉండగానే జూన్ 26న కేజ్రీవాల్‌ను సిబిఐ అరెస్ట్ చేసింది. కేజ్రీవాల్ జైలు నుంచి బయటకు రాకూడదన్న మోడీ ప్రభుత్వ లక్ష్యానికనుగుణంగా సిబిఐ పని చేసిందని తెలుస్తూనే ఉంది. అందుకే, గతంలో ఈ న్యాయస్థానం సిబిఐని పంజరంలో చిలుకతో పోల్చిందని గుర్తు చేస్తూ, అటువంటి భావనలు కలగకుండా చూసుకోవాలని సిబిఐకి సుప్రీం జడ్జి భుయన్ మొట్టికాయలు వేయాల్సి వచ్చింది. ఎలాంటి విచారణ లేకుండా ఒక వ్యక్తిని జైలులో ఉంచడం స్వేచ్ఛను హరించడమేనని ధర్మాసనంలోని మరో జడ్జి సూర్యకాంత్ పేర్కొనడం మానవ హక్కులను చిదిమేస్తున్న సిబిఐకి, ఆ సంస్థను నడిపిస్తున్న మోడీ సర్కారుకు చెంపపెట్టు.

ఒకప్పుడు సిబిఐ అంటే ఎంతటి క్లిష్టమైన కేసులనైనా ఛేదిస్తుందని, బాధితులకు న్యాయం జరుగుతుందని విశ్వాసం ఉండేది. రాను రాను సిబిఐపై రాజకీయ ప్రేరేపితం ఎక్కువ కావడంతో ఆ సంస్థపై అపనమ్మకం గూడు కట్టుకుంటోంది. కేంద్రంలో బిజెపి వచ్చాక ఈ పదేళ్లల్లో సిబిఐ విశ్వసనీయత కోల్పోయింది. సిబిఐకి కేసు వెళ్లడమంటే అది సమాధి అవుతుందన్న పేరు సార్థకమైంది. మన రాష్ట్రంలోనే చూసుకుంటే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణ సాగదీత పెద్ద ఉదాహరణ. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో సిబిఐ అసమర్థత వ్యూహాత్మకంగానే కనిపిస్తోంది. అంతర్వేది రథం దగ్ధం కేసు ఏమైందో తెలీదు. గతంలో టిడిపి నేత కోడెల శివప్రసాద్ ఇంటిలో బాంబు పేలుడు, పరిటాల రవి హత్య, మధ్యప్రదేశ్‌లో వ్యాపం కుంభకోణం వంటి వాటిని చూస్తే సిబిఐ నిబద్ధత ప్రశ్నార్థకంగానే కనిపిస్తుంది. సిబిఐ కేసుల విచారణ, ఛార్జిషీట్ల దాఖలు, అసలైన నిందితులకు శిక్షలు సిబిఐ పెర్ఫార్మెన్స్‌ను మసకబారుస్తున్నాయి. ఇ.డి కేసులో బెయిల్ ఇస్తూ సుప్రీం ధర్మాసనం కేజ్రీవాల్ సి.ఎం కార్యాలయానికి, సెక్రటేరియట్‌కు వెళ్లకూడదని, అధికారిక ఫైళ్లపై సంతకాలు చేయకూడదని షరతులు విధించింది. సిబిఐ కేసులో బెయిల్ మంజూరు చేసిన మరో ధర్మాసనం ఆ షరతుల జోలికి వెళ్లకుండా వాటినే కొనసాగించింది. రాజ్యాంగబద్ధంగా ప్రజలెన్నుకున్న ప్రభుత్వానికి, దాని అధినేత విధుల నిర్వహణకు కోర్టు షరతులు భంగం కలిగిస్తాయి. ఈ విషయంపై కోర్టు ఉత్తర్వులు ప్రజాస్వామ్యవాదులకు అసంతృప్తి కలిగిస్తాయి. సుప్రీం ఆగ్రహంతోనైనా సిబిఐ తన స్వతంత్రతను నిలుపుకోవాలి. మోడీ ప్రభుత్వం సైతం సిబిఐని రాజకీయ కక్షలకు ఉపయోగించుకోవడం మానుకోవాలి.

మహనీయుల మాట



విజయం మనల్ని
ఊరికే వరించదు.
దాని వెనుక ఎంతో కృషి,
పట్టుదల, త్యాగం దాగుంటాయి.
- పీలే,
అమెరికన్ నటుడు.

వ్యాఖ్య

మణిపూర్ బాధ్యతలకు కేంద్రం తిలోదకాలు

మణిపూర్‌లో జాతి ఘర్షణలు ప్రజ్వరిల్లి ఇప్పటికి 16 నెలలు గడచిపోయాయి. వీటిలో 250 మందికి పైగా మరణించగా మరి ఎంతోమంది హింసాకాండలో గాయపడ్డారు. 60,000 మంది ప్రజలు నివాసాలు కోల్పోయి శరణార్థులుగా బతుకుతున్నారు. కేంద్ర ప్రభుత్వం, బిజెపి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘర్షణకు దారి తీసిన మౌలిక సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైనాయి. పరిస్థితి మరింత దిగజారి జాతి విభజన మరింత తీవ్రం కావడానికి దారి తీశాయి. కేవలం కుకీ ప్రాబల్యం గల కొండ ప్రాంతాలకూ, మెయితీలు ప్రధానంగా ఉన్న లోయ ప్రాంతానికి మధ్య ఒక రక్షిత ప్రాంతాన్ని ఏర్పాటు చేయడానికే 60,000 మంది కేంద్ర పోలీసు బలగాలు పనికి వస్తున్నాయి. గత 15 రోజుల్లో పరిస్థితి గణనీయంగా దిగజారింది. పశ్చిమ జిల్లాలో మెయితీలు ప్రధానంగా వుండే ప్రాంతం కౌట్రక్‌లో సెప్టెంబర్ ఒకటవ తేదీన ఇద్దరు వ్యక్తులు చంపివేయబడగా డ్రోన్ దాడిలో తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ దాడి వెనుక కొందరు కుకీ తీవ్రవాదులు ఉన్నారని సందేహాలున్నాయి. అలాగే మరో ప్రాంతంలో ఒక రాకెట్ దాడి కూడా జరిగింది. సెప్టెంబర్ ఆరున జిరిబాం జిల్లాలో ముగ్గురు సాయుధ తీవ్రవాదులతో సహా ఐదుగురు చంపబడ్డారు. రెండు రోజుల తర్వాత పశ్చిమ ఇంపాల్ జిల్లాలోని మెయితీ ప్రాంతం దాటి మధ్యంతర ప్రదేశంలోకి ప్రవేశించినందుకు కుకీ మూలాలు గల ఒక మాజీ సైనిక ఉద్యోగిని కొట్టి చంపారు.

అసలు సమస్య

వాస్తవం ఏమంటే ఒకరికి సంబంధించిన ప్రాంతంలోకి మరొకరు అడుగు పెట్టే పరిస్థితే లేదు. తాజాగా ఈ హింసా ప్రజ్వలన తర్వాత ఇంపాల్ తదితర జిల్లాల్లో తీవ్ర స్థాయిలో విద్యార్థుల నిరసనలకు కారణమైంది. భద్రత సలహాదారును, డిజిపి ని తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు. కుకీ తీవ్రవాదులతో ఆపరేషన్ నిలుపుదల ఒప్పందాన్ని (ఎఒఒ) రద్దు చేయాలనే ఉమ్మడి కమాండ్ కంట్రోల్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని వారు కోరుతున్నారు. పోలీసులతో ఘర్షణలు ఇంపాల్ తూర్పు పశ్చిమ జిల్లాలలో కర్ఫ్యూ విధించడానికి దారితీశాయి. ఇంటర్నెట్, మొబైల్ డేటా కూడా నిలిపివేయబడ్డాయి. ఇరుపక్షాలతో సంప్రదింపులు, చర్చలు జరిపి రాజకీయ సమస్యను పరిష్కరించడంలో వైఫల్యంతో శాంతిభద్రతల పరిరక్షణకు, అలాగే చీలికల మధ్య శాంతిని కాపాడటానికి భద్రత బలగాలపై అతిగా ఆధారపడక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల కేంద్ర పోలీస్ బలగాలు ప్రత్యేకించి అస్సాం రైఫిల్స్ ఒక అనివార్యమైన స్థానంలోకి వచ్చాయి. మెయితీ రాజకీయ పక్షాలు అస్సాం రైఫిల్స్‌ను, ఇతర కేంద్ర బలగాలను ఉపసంహరించాలని కోరుతున్నాయి. కుకి తీవ్రవాదులు డ్రోన్లను, రాకెట్లను ప్రయోగించటం వల్ల బయటి శక్తులు చొరబడుతున్నాయనే ఆందోళన మరింత పెరిగింది. ఇది జాతీయ భద్రతకు ముప్పు అవుతుంది.



ఈ సుదీర్ఘమైన ప్రతిష్టంభన అన్ని తరగతుల వారిలోనూ తీవ్రవాదాన్ని మరింత బలోపేతం చేయడానికి కారణమైంది. ప్రధాని నరేంద్ర మోడీ గత 16 నెలల్లో ఒక్కసారి కూడా మణిపూర్ సందర్శించలేదంటే మణిపూర్ పట్ల కేంద్ర బాధ్యతను విస్మరించటం మరింత పచ్చిగా కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం నేరుగా రంగంలోకి దిగాలి. ప్రధాన జాతుల గ్రూపులతో రాజకీయ సంప్రదింపుల ప్రక్రియ ప్రారంభించటం జరగాలి. శాంతియుత సాధారణ పరిస్థితులను సృష్టించే వాతావరణం కావాలి. అన్ని జాతుల, పౌరుల హక్కులు రక్షించబడాలి. మణిపూర్‌లో ఈ రోగగ్రస్త భాగాన్ని శస్త్ర చికిత్సతో దేహం నుంచి తొలగించకపోతే అది మొత్తం ఈశాన్య భారతంలోనే చాలా తీవ్రమైన పర్యవసానాలకు దారితీస్తుంది.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ముఖ్యమంత్రి పాక్షిక వైఖరి

కుకీ మిలిటెంట్ గ్రూపులతో ఆపరేషన్ల నిలుపుదల ఒప్పందం రద్దు చేయాలనే డిమాండ్ ముఖ్యమంత్రి ఎన్.బిరేన్ సింగ్ నుంచి కూడా రావడం వల్ల కొండ ప్రాంతాల్లో మరోసారి తిరుగుబాటు కార్యక్రమాలు మొదలవవచ్చు. తిరుగుబాటును అణచివేయటానికి సైన్యాన్ని మొహరించే పరిస్థితీ రావచ్చు. మెయితీ తెగ వారికి గిరిజన ఎస్టీ ప్రతిపత్తి కల్పించాలనే కోర్కెతో మొదలైన ఆందోళన, దానికి కుకీ-జో తెగల వారి నుంచి వచ్చిన ప్రతికూల స్పందన, ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ పాక్షిక పాత్ర వహించడం వల్ల మరింత తీవ్రతరమైంది. ఆయన కొన్ని మెయితీ తీవ్రవాద సంస్థల పట్ల సానుకూల సహాయ పాత్ర వహిస్తున్నారు. ఇటీవలనే బయటకు వచ్చిన ఒక ఆడియో ఫైల్‌ను అల్లర్లపై దర్యాప్తు జరుపుతున్న విచారణ కమిషన్‌కు సమర్పించారు. ముఖ్యమంత్రి తన అధికార నివాసం నుంచి మాట్లాడుతున్నట్టు పోలీసు ఆయుధాగారం నుంచి వేలాది ఆయుధాలు కొల్లగొట్టిన వారి పట్ల ఆయన అనుకూలంగా ఉన్నట్లు ఆ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. బిరేన్ సింగ్ ముఖ్యమంత్రిగా నిష్పాక్షిక వైఖరి అనుసరించకపోవటమే సమస్యకు మూల కారణం.

కేంద్రం, బిజెపి బాధ్యతా రాహిత్యం

మోడీ ప్రభుత్వం, బిజెపి కేంద్ర నాయకత్వం... ముఖ్యమంత్రి పాక్షిక పాత్ర పూర్తిగా తెలిసి కూడా అతన్నే పదవిలో కొనసాగిస్తున్నారు. రాజకీయ స్థాయిలో చూస్తే బి.జె.పి, ఆర్.ఎస్.ఎస్ లు మెయితీ తీవ్రవాద జాతిదురభిమానానికి మరింత ఆజ్యం పోయడానికే పాల్పడుతున్నాయి. ఈ తీవ్రవాద సంస్థ వ్యవస్థాపకుడైన టెంగోల్ ఎల్ సనజోబా ను రాజ్యసభ సభ్యుడిని చేయటమే ఇందుకు నిదర్శనం. ఈ సుదీర్ఘమైన ప్రతిష్టంభన అన్ని తరగతుల వారిలోనూ తీవ్రవాదాన్ని మరింత బలోపేతం చేయడానికి కారణమైంది. ప్రధాని నరేంద్ర మోడీ గత 16 నెలల్లో ఒక్కసారి కూడా మణిపూర్ సందర్శించలేదంటే మణిపూర్ పట్ల కేంద్ర బాధ్యతను విస్మరించటం ద్వారా మరింత పచ్చిగా కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం నేరుగా రంగంలోకి దిగాలి. ప్రధాన జాతుల గ్రూపులతో రాజకీయ సంప్రదింపుల ప్రక్రియ ప్రారంభించటం జరగాలి. శాంతియుత సాధారణ పరిస్థితులను సృష్టించే వాతావరణం కావాలి. అన్ని జాతుల, పౌరుల హక్కులు రక్షించబడాలి. మణిపూర్‌లో ఈ రోగగ్రస్త భాగాన్ని శస్త్ర చికిత్సతో దేహం నుంచి తొలగించకపోతే అది మొత్తం ఈశాన్య భారతంలోనే చాలా తీవ్రమైన పర్యవసానాలకు దారితీస్తుంది.

(సెప్టెంబర్ 11 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

జనవాక్యం

సహ చట్టం ఉల్లంఘిస్తే....

పరిపాలన పారదర్శకంగా ఉండేందుకు, అవినీతి రహితంగా ఉండేందుకు, తమ ప్రజాసేవకుల పనితీరు తెలుసుకునేందుకు, ప్రజలకు ఒక ఆయుధంగా 2005లో సహ చట్టం అమలులోకి వచ్చింది. అప్పటివరకు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళి ఏదైనా సమాచారం అడిగితే చూస్తాం అని చెప్పే అధికారులకు, ఈ చట్టం వలన సమాచారం తప్పక ఇవ్వవలసిన పరిస్థితి వచ్చింది. పాలనలో రహస్యం అంటూ ఉండకూడదు. ఈ చట్టాన్ని సహ కార్యకర్తలు బాగా ఉపయోగించు కుంటున్నారు. ఈ పరిస్థితి అధికారులకు ఇష్టంలేక, అడిగిన సమాచారం ఇవ్వకుండా, ఆలస్యంగా తప్పుడు సమాచారం ఇస్తున్నారు. అప్పిల్లేట్‌కి ఫిర్యాదు చేస్తే వాళ్లు కూడా తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవటంలేదు. వీళ్ళిద్దరు మీద కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే కమిషన్ కూడా ఇదే పరిస్థితి. ఇద్దరు చట్టాన్ని ఉల్లంఘించారు అని రుజువులతో చూపించినా, కమిషన్ ఆలస్యమైనా సమాచారం ఇచ్చారు కదా అంటూ సర్దిచెప్పటానికి ప్రయత్నిస్తారు. వీళ్లందిరి మీద ఇంక హైకోర్టుకు వెళ్లాలి. హైకోర్టుకు ఎంతమంది వెళ్ళగలరు? లాయర్ను పెట్టుకోవాలి. వాళ్లు ఎంత డిమాండు చేస్తారో తెలియదు. ఈ నాన్సెన్స్ ఎందుకూ? అధికారులు చట్టప్రకారం అడిగిన సమాచారం, సరైన సమయంలో ఇస్తే, ఈ తిప్పలు సహ కార్యకర్తలకు ఉండవు కదా! అధికారులు చట్టాన్ని ఉల్లంఘించారని రుజువైతే కచ్చితంగా వారికి జరిమానా విధించి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటే చట్టం లక్ష్యం నెరవేరుతుంది.

- నార్నె వెంకట సుబ్బయ్య.


మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

విశ్లేషణ

పాలకుల నిర్లక్ష్యం వల్లే బుడమేరు విలయం

ఆగస్టు 30, 31 సెప్టెంబర్ ఒకటవ తేదీలలో వాయుగుండం ప్రభావంతో కురిసిన కుండపోత వర్షాలకు విజయవాడ నగరం అతలాకుతలం అయింది. ఎన్టీఆర్, కృష్ణ, గుంటూరు, బాపట్ల, ఏలూరు జిల్లాలను వరదలు ముంచెత్తాయి. కృష్ణా నదికి ఎన్నడూ లేనంతగా 11.43 లక్షల క్యూసెక్కుల వరద రాగా, అదే సమయంలో బుడమేరకు 43 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. బుడమేరు డైవర్షన్ ఛానల్‌కు మూడు చోట్ల గండ్లు పడడంతో విజయవాడ నగరంలో 31 వార్డులు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. విజయవాడ పరిసర గ్రామాలు, కృష్ణా నది కట్ట లోపల గ్రామాలు ముంపుకు గురయ్యాయి. ప్రభుత్వ లెక్క ప్రకారం ఏడు లక్షల మంది వరద ప్రభావానికి గురయ్యారని, ఎన్టీఆర్, కృష్ణ, గుంటూరు, బాపట్ల, ఏలూరు జిల్లాలలో 5.67 లక్షల ఎకరాల పంటలు నీట మునిగాయని పేర్కొంది.

ఆగస్టు 20 నాటికే ఆల్మట్టి నుండి పులిచింతల వరకు ప్రాజెక్టులన్నీ పూర్తిగా నిండి ఉన్నాయి. 28వ తేదీన వాతావరణ శాఖ తుఫాను హెచ్చరిక చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదు. హెచ్చరికలు చేయకపోవడంతో ప్రజలు వరదలలో చిక్కుకుపోయారు. కట్టుబట్టలతో మిగిలారు.



వై. కేశవరావు

పాలకుల నిర్లక్ష్యం

బుడమేరుపై పాలకుల నిర్లక్ష్యం ఈనాటిది కాదు. 1960 బుడమేరుపై వెలగలేరు వద్ద రెగ్యులేటర్, కృష్ణ నదిలో డైవర్షన్ ఛానల్ నిర్మించి ఉన్నాయి. 1964 రికార్డు స్థాయిలో వరద వచ్చినప్పుడు కేంద్ర జల సంఘం ఏసీ మిత్రా నేతృత్వంలో నిపుణుల కమిటీని నియమించింది. కొల్లేరు దాని పరివాహక ప్రాంతంలో కొల్లేరులో కలిసే బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు, ఎర్ర కాలువ, గుండేరు, ఉప్పుటేరును సమగ్రంగా పరిశీలించిన మిత్రా కమిటి ముంపు నివారణ చర్యలు సూచించింది. ఆనాడు రూ.15 కోట్లతో ప్రణాళిక రూపొందించింది. వరద ప్రమాద నివారణకు బుడమేరుపై చర్యలు ప్రధానమైనవని నొక్కి చెప్పింది. ప్రభుత్వం ఆ సూచనల అమలుకు పూనుకోలేదు. 1977-78 కాలంలో తిరిగి తీవ్రమైన వరదలు వచ్చాయి. అప్పుడు జె.సి ముర్రే నాయకత్వాన మరో కమిటీని నియమించారు. ఆ కమిటీ వరదలు నివారణకు రూ.43 కోట్లతో ప్రణాళిక రూపొందించింది. అదీ అమలుకు నోచుకోలేదు. 1986లో శ్రీరామకృష్ణయ్య కమిటీని నియమించారు. ఆ చర్యలను తీసుకోని పక్షంలో విజయవాడ నగరానికి వచ్చే ముంపు గురించి హెచ్చరించారు. ఆ కమిటీ సూచనలు అమలుకు పూనుకోలేదు.

1986-1987-1988 సంవత్సరాలలో వరుసగా వరదలు వచ్చాయి. 1986లో రెండు లక్షల ఎకరాలు, 1987లో 2.73 లక్షల ఎకరాలు, 88 లో 1.5 లక్షల ఎకరాలు కృష్ణ డెల్టాలో చేతికి వచ్చిన పంటలు వరదల పాలయ్యాయి.

రైతాంగం ఆందోళనలు

ఈ కాలం అంతా వివిధ రూపాలలో ఆందోళనలు సాగిస్తూ వచ్చిన కృష్ణా జిల్లా రైతు సంఘం దీర్ఘకాలిక పోరాటానికి సిద్ధమైంది. 1989 సెప్టెంబర్ 26న గన్నవరంలో సదస్సు నిర్వహించింది. 2000 మంది రైతులు పాల్గొన్నారు. ఆ సదస్సులో ముఖ్యమంత్రి సలహాదారుగా ఉన్న ప్రఖ్యాత ఇంజనీర్ శ్రీరామకృష్ణయ్య, డ్రైనేజీ బోర్డు చైర్మన్ తుమ్మల చౌదరి, ఏపీ రైతు సంఘం నాయకులు కొరటాల సత్యనారాయణ, పార్లమెంటు సభ్యులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, అట్లూరు శ్రీమన్నారాయణ హాజరయ్యారు. శ్రీరామకృష్ణయ్య ఆ మరుసటి రోజే ఇరిగేషన్ డ్రైనేజ్ అధికారులతో రైతు సంఘాల నాయకులతోనూ ప్రత్యేక సమావేశం జరిపి చర్చించి ముంపు నివారణకు తీసుకోవలసిన చర్యలపై ప్రణాళిక రూపొందించమని అధికారులకు పురమాయించారు. ఆనాటి ఇరిగేషన్ ఎస్.ఇ గా ఉన్న మనోహరం రూ.75.60 కోట్లతో చేపట్టవలసిన వరద నివారణ చర్యలకు ప్రణాళిక రూపొందించారు.

పై ప్రణాళిక అమలు కోసం కృష్ణా జిల్లా రైతు సంఘం నాయకులు వై.కేశవరావు, సూరపనేని సుబ్రహ్మణ్యం, నీలం మురళీకృష్ణా రెడ్డి, ఆళ్ల ఈశ్వరరావు, గూడపాటి వెంకటేశ్వర రావు, మూలుపూరు వెంకటరత్నంలతో కార్యాచరణ కమిటీని ఏర్పరచింది. వరుసగా రాయబారాలు, ధర్నాలు రాస్తారోకోలు నిర్వహించింది. పుట్టగుంట దగ్గర బుడమేరు వంతెనపై 1000 మంది రైతులతో ఎడ్లబండ్లతో ధర్నా నిర్వహించింది. ముదినేపల్లిలో ఎర్నేని నాగేంద్రనాథ్ వగైరాలు నిరాహార దీక్ష నిర్వహించగా ఆ శిబిరానికి మద్దతుగా 1000 మంది రైతులను సమీకరించి సభ జరిపింది. పరివాహక ప్రాంతంలోని 20 కేంద్రాలలో రాస్తారోకోలు నిర్వహించింది. 1990 జూన్ 4వ తేదీ గుడివాడ ఆర్డీఓ కార్యాలయాన్ని 3000 మంది రైతులతో ముట్టడించింది. ఏడవ తేదీ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి ఉపప్రధాని దేవీలాల్ రాక సందర్భంగా రైతులను సమీకరించింది. ఫలితంగా పనులు చేపట్టారు. పనుల పర్యవేక్షణకు బి.సి. శర్మ నేతృత్వంలో పది మంది నిపుణుల బృందం ఏర్పడింది.

వరద నివారణ పనులు అమలు జరిపిన తీరు

ఆ కాలంలో గుండేరు, లజ్జబండ, పోల్రాజు డ్రైన్, పోల్రాజు కాలువ, డెల్టాలో బుడమేరుకు చానలైజేషన్ పనులు వంటివి జరిగాయి. కృష్ణా నదికి కరకట్టలు అభివృద్ధి పనులు జరిగాయి ముంపు నివారణకు ప్రధానమైన రాయనపాడు నుండి రామవరప్పాడు వరకు స్ట్రైట్ కట్ నిర్మాణంగాని, బుడమేరు నుండి కృష్ణా నదికి మరొక డైవర్షన్ ఛానల్ నిర్మాణం గానీ, విజయవాడ నగరంలో కట్టల అభివృద్ధి చర్యలుగాని చేపట్టలేదు. వెలగలేరు ఎగువ ప్రాంతాల్లో రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టలేదు. బ్రహ్మయలింగం చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసే పనులు చేపట్టినప్పటికి మధ్యలోనే నిలిపివేశారు. పైగా విజయవాడ నగరంలో బుడమేరుకు కట్టల లోపల అపార్ట్మెంట్లు, కాలనీలు ఏర్పాటయ్యాయి. వరద కట్టలు శిథిలావస్థకు చేరుకున్నాయి. విజయవాడలో విస్తరించిన పేదల కాలనీలన్నీ బుడమేరు పరివాహక ప్రాంతంలోనే సాగాయి. అనంతరం కష్ణ డెల్టా ఆధునీకరణ పనులు చేపట్టినా పై ప్రధాన ముంపు నివారణ పనుల జోలికి వెళ్లలేదు.

మిత్రా కమిటీ సూచనలకు 60 ఏళ్లు, ముర్రే కమిటీ, శ్రీరామకృష్ణయ్య సూచనలకు 45 ఏళ్ల నిండాయి. డ్రైనేజీ బోర్డును ఎత్తేశారు. గుడివాడ, తెనాలి, భీమవరంలో డిఈ కార్యాలయాలు మాత్రమే ఉన్నాయి. జిల్లా ఇరిగేషన్ అధికారులే డ్రైనేజ్ ఇన్చార్జిలుగా ఉన్నారు. గత రెండు దశాబ్దాలుగా కృష్ణా జిల్లాకు రెగ్యులర్ ఎస్.ఇ లేరు. ఇన్‌చార్జీలు మాత్రమే ఉన్నారు. నిరంతరం కాలువలపై పని చేసే లస్కర్లను తగ్గించి వేశారు. డ్రైనేజీ వ్యవస్థ నిర్లక్ష్యం చేయబడింది.

ఈ కాలంలో 20 సంవత్సరాలు తెలుగుదేశం, 20 సంవత్సరాల కాంగ్రెస్, ఐదు సంవత్సరాల వైఎస్ఆర్‌సిపి పరిపాలించాయి. ఫలితం నిపుణుల కమిటీల సూచనల అమలుపై నిర్లక్ష్యం. ఫలితం విజయవాడ నగరంలో వరద విలయ తాండవం.

ప్రస్తుత విజయవాడ-బుడమేరు పరిస్థితి

యాభయ్యేళ్ల నాడు విజయవాడ జనాభా ఐదు లక్షలు. ఈనాడు 15 లక్షలు. ఇబ్రహీంపట్నం కొండపల్లి మున్సిపాలిటీగా అభివృద్ధి అయ్యింది. యనమలకుదురు, కానూరు, పోరంకి మున్సిపాలిటీగా అభివృద్ధి అయ్యింది. గొల్లపూడి మున్సిపాలిటీ స్థాయికి ఎదిగింది. బుడమేరు కట్ట లోపల అపార్ట్‌మెంట్లు, కాలనీలు వెలిశాయి. లక్షలాది పేదలు నివాసాలు ఏర్పరుచుకున్నారు. ఇబ్రహీంపట్నం దగ్గరున్న డైవర్షన్ ఛానల్‌లో విటిపిఎస్ వేడి నీరు ప్రవాహం కలుస్తుంది. ఆ కాలువ లోనే (ప్రైవేట్) యాక్టివ్ పవర్ ప్రాజెక్ట్ నెలకొల్పారు. ఈ కాలువలోనే పోలవరం కాలువను కూడా మళ్ళించారు. రైల్వే ట్రాక్‌లన్నీ విస్తరించాయి. నాటి డబుల్ లైన్ రోడ్లన్నీ ఆరు లైన్ల రోడ్లుగా విస్తరించాయి. కొల్లేరు పరివాహక ప్రాంతంలోనూ, కొల్లేరులోను, చేపల చెరువులు డ్రైనేజీ వ్యవస్థకు ఆటంకంగా పరిణమించాయి. వరదలు వచ్చినప్పుడు మట్టి ఇసుకతో కూడి వస్తుంది. తరచూ వరదలకు డ్రెయిన్లు, కాలువలు, ఎగువ ప్రాంతంలో ఉన్న చెరువులు పూడికలు వేస్తున్నాయి. ఎప్పటికప్పుడు పూడిక తీస్తూ ఉండాలి. ఈనాడు ఉన్న పరిస్థితులలో బుడమేరు కొల్లేరు ముంపు నివారణకు అవసరమైన చర్యల కోసం నిపుణులతో కమిటీ వేసి తీసుకోవలసిన చర్యలను సమగ్రంగా రూపొందించాల్సి ఉంది. ప్రభుత్వం రాజకీయ పార్టీలు, అన్ని రైతు సంఘాలతో సమావేశం జరిపి అభిప్రాయాలు తీసుకోవలసి ఉంది.

/ వ్యాసకర్త సీనియర్ రైతు నాయకులు /



బుడమేరు కట్ట లోపల అపార్ట్‌మెంట్లు, కాలనీలు వెలిశాయి. లక్షలాది పేదలు నివాసాలు ఏర్పరుచుకున్నారు. ఇబ్రహీంపట్నం దగ్గరున్న డైవర్షన్ ఛానల్‌లో విటిపిఎస్ వేడి నీరు ప్రవాహం కలుస్తుంది. ఆ కాలువ లోనే (ప్రైవేట్) యాక్టివ్ పవర్ ప్రాజెక్ట్ నెలకొల్పారు. ఈ కాలువలోనే పోలవరం కాలువను కూడా మళ్ళించారు. రైల్వే ట్రాక్‌లన్నీ విస్తరించాయి. నాటి డబుల్ లైన్ రోడ్లన్నీ ఆరు లైన్ల రోడ్లుగా విస్తరించాయి. కొల్లేరు పరివాహక ప్రాంతంలోనూ, కొల్లేరులోను, చేపల చెరువులు డ్రైనేజీ వ్యవస్థకు ఆటంకంగా పరిణమించాయి. వరదలు వచ్చినప్పుడు మట్టి ఇసుకతో కూడి వస్తుంది. తరచూ వరదలకు డ్రెయిన్లు, కాలువలు, ఎగువ ప్రాంతంలో ఉన్న చెరువులు పూడికలు వేస్తున్నాయి. ఎప్పటికప్పుడు పూడిక తీస్తూ ఉండాలి. ఈనాడు ఉన్న పరిస్థితులలో బుడమేరు కొల్లేరు ముంపు నివారణకు అవసరమైన చర్యల కోసం నిపుణులతో కమిటీ వేసి తీసుకోవలసిన చర్యలను సమగ్రంగా రూపొందించాల్సి ఉంది. ప్రభుత్వం రాజకీయ పార్టీలు, అన్ని రైతు సంఘాలతో సమావేశం జరిపి అభిప్రాయాలు తీసుకోవలసి ఉంది.

గన్నవరం సదస్సులో (26.9.1989) చేసిన తీర్మానం
(నాటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డికి పంపినది)

- మిత్రా కమిటీ, చీఫ్ ఇంజనీరు శ్రీ ముర్రే సూచనల మేరకు వెలగలేరు రెగ్యులేటర్ ఎగువన స్టోరేజి రిజర్వాయర్లు నిర్మించాలి.
- వెలగలేరు రెగ్యులేటర్ నుండి ప్రస్తుతం వున్న డెవర్షన్ ఛానల్ పక్కనే మరొక డైవర్షన్ ఛానల్ నిర్మించాలి. ఇప్పుడున్న ఛానల్‌ను పూడిక తీసి, అభివృద్ధి పర్చాలి.
- .రెగ్యులేటర్ ఎగువన, దిగువన కూడా అవసరమైనంత వరకు వరద కట్టలు బలంగా నిర్మించాలి.
- విజయవాడ నగర విస్తరణ రీత్యా బుడమేరు లోతట్టులో ఇళ్లు వేసుకొని వున్న పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వాలి. బుడమేరును గరిష్ట ప్రవాహానికి అనుగుణంగా వెడల్పు చేయాలి.
- పాత పాయికాపురం నుండి గుణదల దగ్గరున్న 30 తూముల రెల్వే బ్రిడ్జి వరకు అవసరమైన భూమిని సేకరించి మురుగు కాలువను తవ్వించాలి.
- విజయవాడ దగ్గర వున్న రింగు లూప్ సవరించటానికి గాను రాయనపాడు నుండి రామవరప్పాడు వరకు స్ట్రెయిట్ కాలువను తవ్వించాలి.
- బ్రహ్మయలింగం చెరువు, నగూరు అమని చెరువులను మిత్రా కమిటీ సూచనల మేరకు రిజర్వాయరుగా అభివృద్ధి చేయాలి. బుడమేరు పరివాహక ప్రాంతంలో వున్న 111 చెరువులను వాటి సామర్థ్య స్థాయికి అభివృద్ధి చేయాలి.
- హెచ్.ముత్యాలంపాడు నుండి ఇలపర్రు వరకు బుడమేరు పైనున్న పాత వంతెనలను గరిష్ట ప్రవాహ స్థాయికి అనుగుణంగా అభివృద్ధి చేయాలి.
- బుడమేరు దగ్గర కట్ట లోపల ప్రవాహాలకున్న అవరోధాలను తొలగించి ఛానలైజ్ చేయాలి. అందుకు అవసరమైన భూమిని రెతులకు న్యాయమైన నష్ట పరిహారం ఇచ్చి తీసుకోవాలి. కట్ట లోపల పంటలను రెగ్యులరైజ్ చేయాలి.
- కేసరపల్లి నుండి ఇలవరు వరకు బుడమేటి లోకి వున్న షాపు ఇన్‌లెట్లు అన్నిటిని స్లాబ్ కల్వర్టులుగా మార్చి స్ల్యూగేజింగ్ షట్టర్లు అమలు పర్చాలి.
- మిత్రా కమిటీ సూచనల మేరకు ఉప్పుటేరును 20 వేల క్యూసెక్కులకు అభివృద్ధి పరచి, రెగ్యులేటర్‌ను నిర్మించాలి.
- కొల్లేరులోని ప్రధాన ప్రవాహ మార్గాలను అన్నిటిని ఛానలైజ్ చేయాలి. పనుల నిర్వహణకు గాను, తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాము.

పటిష్ట ఆదేశాలివ్వండి

- సిజెఐకు వెయ్యిమందికి పైగా ప్రముఖులు, సంస్థల లేఖ
- సుమోటోగా తీసుకున్నా అభయ కేసులోఇంత జాప్యమా?

ముంబయి : ఆర్‌జి కర్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసులో సమర్ధవంతమైన న్యాయపరమైన ఆదేశాలను జారీ చేయాలని కోరుతూ పౌర సంఘాలు, ప్రముఖులు, మేధావులు భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్‌కు లేఖ రాశారు. వెయ్యి మందికి పైగా ప్రముఖులు, 55 సంస్థలు ఈ బహిరంగ లేఖ ఆదివారం రాశాయి. సౌత్ ఆసియన్ సాలిడారిటీ కలెక్టివ్, వేవ్ ఫౌండేషన్, లాయర్స్ కలెక్టివ్, సిపిఎం, ఆదివాసీ మహిళల నెట్‌వర్క్ వంటి సంస్థలు ఇందులో వున్నాయి. రేపిస్టులను, హంతకులను గుర్తించి, అరెస్టు చేసి, కఠినంగా శిక్షించడంతో సహా ప్రధానంగా 9 డిమాండ్లను ఆ లేఖలో ప్రస్తావించారు. జాతీయ టాస్క్ ఫోర్స్ (ఎన్‌టిఎఫ్) కూర్పును సుప్రీంకోర్టు మార్చాలని కోరారు. ఆరోగ్య రంగంలో వ్యవస్థాగతమైన లోపాలు, లొసుగులు, అవినీతి రాకెట్ల గురించి తెలుసుకోవడానికి సమర్ధవంతమైన రీతిలో నిజ నిర్ధారణ జరగడానికి వీలుగా ఈ టాస్క్ ఫోర్స్‌లో డాక్టర్లు, విద్యార్ధులు, హక్కుల కార్యకర్తలు, లాయర్లను తీసుకోవాలని కోరారు. ఎన్‌టిఎఫ్, ఆందోళన చేస్తున్న జూనియర్‌డాక్టర్లతో, విద్యార్ధులు, మహిళలు, ఫెమినిస్ట్ సంఘాలు, వేదికలు ఇలా ఈ ఉద్యమంలో భాగస్తులైన వారితో సంప్రదింపులు జరపాల్సిన అవసరం వుందని ఆ లేఖ పేర్కొంది. ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేయడంతోపాటూ విచారణ ప్రక్రియను మరింత వేగిరపరిచేందుకు వీలుగా తీసుకోవాల్సిన చర్యలను తీసుకోవాలని కోరింది. తప్పు చేసిన పోలీసు అధికారులు, స్థానిక పార్టీ కార్యకర్తలు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో శాంతియుతంగా ఆందోళన జరుపుతున్న వారిపై భౌతికంగా దాడికి దిగిన వారు ఇలా అందరిపై చర్యలకు ఆదేశించాలన్నారు.



సుప్రీం కోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించినా ఇక ఇలాగే ప్రతిష్టంభనలో వుండడం పట్ల వారు విస్మయం వ్యక్తం చేశారు. ఆందోళనకారుల ఆవేదనను, ఆగ్రహావేశాలను బాధను పరిష్కరించడంలో సుప్రీం విఫలమైందన్నారు. నెల రోజులు గడిచినా, ఇంకా సిబిఐ ఈ కేసులో ఎలాంటి నిర్ధారణలకు రాలేదని ఆ లేఖ పేర్కొంది.

బెంగాల్ ప్రభుత్వం మొండి వైఖరి

- మమతతో జూనియర్ డాక్టర్ల చర్చలు విఫలం

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ యంత్రాంగం, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మొండి వైఖరి కారణంగా జూనియర డాక్టర్లతో సోమవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఆర్‌జి కర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటన నేపథ్యంలో నెల రోజులుగా సమ్మె చేస్తున్న వైద్యులతో సోమవారం సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకూ కొల్‌కతాలోని కాళీఘాట్‌లో చర్చలు జరిగాయి. స్టెనోగ్రాఫర్లతో కలిసి సోమవారం సాయంత్రం 6:19 గంటలకు కాళీఘాట్‌కు 30 మంది వైద్యుల బృందం చేరుకుంది. ఐదు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వైద్యుల బృందం ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి అందజేసింది. ప్రొసిడింగ్స్‌ను రికార్డు చేసేందుకు ఇద్దరు స్టెనోగ్రాఫర్లను వైద్య బృందం తమ వెంట తీసుకెళ్లింది. ఈ చర్చల్లో ముఖ్యమంత్రితోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్, హోం శాఖ కార్యదర్శి నందిని చక్రవర్తి, డిజి రాజీవ్ కుమార్, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి చంద్రిమా భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు. ఇంతకు ముందు రెండుసార్లు జరిగిన చర్చలు కూడా విఫలమయ్యాయి. అనంతరం వైద్యులు మాట్లాడుతూ 'చర్చల్లో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మళ్లీ అందరితో మాట్లాడిన తరువాత నిర్ణయం తీసుకుంటాం. ఆందోళన మరిన్ని రోజులు కొనసాగుతోంది. మరింత తీవ్రంగా ఉంటుంది' అని చెప్పారు. సమస్య త్వరగా పరిష్కారం కావాలని కోరుకుంటున్నామని, అంతమాత్రాన ప్రధానమైన ఐదు డిమాండ్లపై రాజీ పడేది లేదని తేల్చి చెప్పారు.

ఉద్యోగులకు తలొగ్గిన సెబీ

- సమస్యలను పరిష్కరించుకుంటామని హామీ

ముంబయి : సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజి బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) ఉద్యోగుల డిమాండ్‌కు తలొగ్గింది. పని ప్రదేశంలో తమపై తీవ్ర ఒత్తిడి ఉందని.. తమ పట్ల సెబీ ఛైర్‌పర్సన్ మాధబి బుచ్ వ్యవహారశైవి అభ్యంతరకరంగా ఉందని ఇటీవల కొందరు ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పని సంస్కృతి విధానంపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేయడంపై.. వారిపై బయటి వ్యక్తుల ప్రోద్భలం ఉందంటూ సెబీ ఈ నెల 4న ఓ పత్రికా ప్రకటన విడుదల చేసింది. దీనిపై ఉద్యోగులు నిరసన వ్యక్తం చేయడంతో వెనక్కి తగ్గింది. ఇకపై ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను అంతర్గతంగానే పరిష్కరించుకుంటామని సోమవారం స్పష్టం చేసింది. ఈ అంశంలో ఇటీవల ఉద్యోగుల ప్రతినిధులతో జరిపిన చర్చల్లో తాము ఓ అంగీకారానికి వచ్చినట్లు వెల్లడించింది. ఇకపై సంస్థకు సంబంధించిన అంతర్గత వ్యవహారాలు నిర్ణీత సమ యంలో అంత ర్గతంగానే పరిష్కరించుకోవాలని నిర్ణయానికొచ్చామని, ఇందుకోసం ఓ విధానం ఏర్పాటు చేసుకుం టామని తెలిపింది. భారత సెక్యూరిటీ మార్కెట్‌ను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దిన ఘనత ఉద్యోగులకు దక్కుతుందని పేర్కొంది.

మసీదుపై దాడి కేసులో.... బిజెపి, విహెచ్‌పి నేతలపై కేసులు

సిమ్లా : హిమాచల్ ప్రదేశ్‌లోని సంజౌలి మసీదుపై ఈ నెల 11న జరిగిన దాడికి సంబంధించి బిజెపి, విహెచ్‌పిలకు చెందిన నాయకులపై పోలీసులు ఎనిమిది కేసులు నమోదు చేశారు. సిమ్లా, సోలాన్ ప్రాంతాలకు చెందిన ఈ నాయకులలో విహెచ్‌పి రాష్ట్ర కార్యదర్శి, ఆర్గనైజింగ్ సెక్రటరీతో పాటు బిజెపి కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు కూడా ఉన్నారు. సంజౌలిలోని మసీదును కూల్చివేయాలని వీరంతా డిమాండ్ చేస్తున్నారు. మొత్తంమీద 50 మంది అనుమానితులపై కేసులు నమోదయ్యాయి. వీరంతా నిషేధాజ్ఞలు ఉల్లంఘించి, పోలీసులపై రాళ్లు రువ్వారు. నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది. వారిలో కొందరు పరారీలో ఉన్నారు. హిందూత్వ మూకల దాడిలో ఆరుగురు పోలీసులు గాయపడ్డారని, వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదని ఎస్‌పి తెలిపారు. సిమ్లాలో ఉద్రిక్తత నేపథ్యంలో మసీదులోని అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేసేందుకు ముస్లిం సంక్షేమ కమిటీ సిద్ధపడింది. ప్రభుత్వ భూమిలో ఉన్న మసీదు గోడను కొందరు ముస్లింలు స్వచ్ఛందంగా కూల్చివేశారు.

ఇంటర్నెట్ సేవలపై నిషేధం ఎత్తివేసిన మణిపూర్

ఇంఫాల్ : మణిపూర్‌లో ఇటీవల మరోసారి హింస చెలరేగడంతో ఈ నెల 10వ తేదీన విధించిన నిషేధాన్ని సోమవారం మణిపూర్ ప్రభుత్వం ఎత్తివేసింది. ఈమేరకు రాష్ట్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. మణిపూర్‌లో కుకీలకు, మొయితీలకు మధ్య జరిగిన సంఘర్షణల కారణంగా ఇంఫాల్ పశ్చిమ, తూర్పు జిల్లాలతోపాటు తౌబాల్, బిష్ణుపూర్, కక్చింగ్ జిల్లాల్లో శాంతి భద్రతల దృష్ట్యా మణిపూర్ ప్రభుత్వం ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి ఇంటర్నెట్ మొబైల్ సేవలపై నిషేధం విధించింది. ప్రస్తుతం అక్కడ ఉన్న పరిస్థితిని పరిశీలించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల కోసం ఇంటర్నెట్, మొబైల్ సేవలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది.

నేడు కేజ్రీవాల్ రాజీనామా

- సాయంత్రం 4.30 గంటలకు లెఫ్టినెంట్ గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరిన ఢిల్లీ సిఎం
- నేడు ఆప్ శాసన సభాపక్ష సమావేశంలో కొత్త సిఎం పేరు ఖరారు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయం వేడెక్కింది. అక్కడ అధికార ఆప్ రాజకీయాలు చకచకా మారుతున్నాయి. నేడు అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా అపాయింట్‌మెంట్ కోరారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు కలుసుకునేందుకు ఎల్‌జి అనుమతించినట్టు 'ఆప్' వెల్లడించింది. ఈ సమయంలోనే తన రాజీనామాను కేజ్రీవాల్ సమర్పించనున్నారు. దీంతో ఢిల్లీ తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నదానిపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. కేజ్రీవాల్‌ను ఆప్ సీనియర్ నేతలు మనీష్ సిసోడియా, రాఘవ్ చద్దా సోమవారం ఉదయం కలుసుకున్నారు. సాయంత్రం ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఎసి) భేటీ అయ్యింది. ఈ సమావేశంలో ఢిల్లీ తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై చర్చ జరిగినట్టు తెలిసింది. పిఎసి సభ్యులు ఒక్కొక్కరు తమ అభిప్రాయాలను కేజ్రీవాల్‌కు తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు కేజ్రీవాల్ నివాసంలో ఆప్ ఎమ్మెల్యేలు సమావేశమై ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఏకాభిప్రాయ అభ్యర్థి పేరును చర్చించనున్నారు. నేడు (మంగళవారం) శాసన సభాపక్ష సమావేశం ఉంటుందని, ఆ సమావేశంలో ముఖ్యమంత్రి ఎవరనేది నిర్ణయం తీసుకుంటారని ఆప్ సీనియర్ నేత సౌరభ్ భరద్వాజ్ తెలిపారు. ఢిల్లీ మంత్రులు, పిఎసి సభ్యుల అభిప్రాయాలను వ్యక్తిగతంగా కేజ్రీవాల్ తెలుసుకున్నారని చెప్పారు. మరోవైపు, కేజ్రీవాల్ జైలులో ఉన్న సమయంలో పార్టీ కీలక బాధ్యతలు నిర్వహించిన అతిషి ముఖ్యమంత్రి రేసులో ముందున్నారని ప్రచారం జరుగుతోంది. కేజ్రీవాల్ జైల్లో ఉన్న సమయంలో అన్నీ తానై పార్టీ వ్యవహారాలు, ప్రభుత్వ బాధ్యతలను అతిషి చక్కదిద్దారు. ప్రభుత్వంలోని మొత్తం 14 విభాగాలకు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న ఆమె, క్యాబినెట్ మంత్రుల్లో అత్యధిక విభాగాలను కూడా చూస్తున్నారు. ఇదే సమయంలో అతిషితోపాటు సౌరభ్ భరద్వాజ్, కైలాశ్ గెహ్లాట్, గోపాల్ రాయ్, ఎంపీ రాఘవ్ చద్దా పేర్లను ఆప్ పరిశీలిస్తున్నట్టు సమాచారం. కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ పేరు కూడా తెరపైకి వచ్చింది.

రేపు జమ్మూకాశ్మీర్‌లో తొలి దశ ఎన్నికలు

- బహుళ అంచెల భద్రతా ఏర్పాట్లు

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బుధవారం తొలి దశ ఎన్నికలు జరగనున్నాయి. మొదటి దశలో 24 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికల నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. బహుళ అంచెల భద్రతాను ఏర్పట్లు చేస్తున్నట్లు కాశ్మీర్ జోన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వికె బిర్డి సోమవారం మీడియాకు తెలిపారు. బహుళస్థాయి భద్రతలో భాగంగా సెంట్రల్ ఆర్మ్‌డ్ పారామిలటరీ ఫోర్సెస్ (సిఎపిఎఫ్), జమ్మూకాశ్మీర్ ఆర్మ్‌డ్ పోలీసులు, జమ్మూకాశ్మీర్ పోలీసులను మోహరిస్తామని చెప్పారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, నిర్భయ వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. జమ్మూకాశ్మీర్‌లో పదేళ్ల తరువాత జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలతో పాటు, 2019లో ఆర్టికల్ 370 రద్దు చేసి, రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన తరువాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 18, ఈ నెల 25న, అక్టోబర్ 1న మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 8న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.



అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే మైనార్టి కమిషన్ : కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

జమ్ముకాశ్మీర్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సోమవారం మేనిఫెస్టోను విడుదల చేసింది. శ్రీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు పవన్ ఖేరా దీనిని విడుదల చేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే జమ్ముకాశ్మీర్‌లో మైనారిటీ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ఈ మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. యాపిల్‌కు కిలోకు రూ. 72 కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి), అన్ని పంటలకు 100% బీమా కల్పిస్తామని తెలిపింది. భూమిలేని రైతులకు నెలకు రూ.4,000 చొప్పున మద్దతు ఇస్తామని పవన్ ఖేరా తెలిపారు.

మళ్లీ ఉగ్రవాదంలోకి నెట్టేందుకు చూస్తున్నారు : అమిత్ షా

జమ్ముకాశ్మీర్‌ని మళ్లీ ఉగ్రవాదంలోకి నెట్టేందుకు కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ చూస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శించారు. కాశ్మీర్‌లోని కిష్త్వార్‌లో సోమవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్‌షా మాట్లాడుతూ 'కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ ఈ ప్రాంతాన్ని (జమ్మూకాశ్మీర్)ని మళ్లీ ఉగ్రవాదంలోకి నెట్టే ఉద్దేశంతోనే ఉన్నాయి. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) ఈ రెండు పార్టీలు తీవ్రవాదంపై సాఫ్ట్‌గానే ఉన్నాయి. ఈ కూటమి అధికారంలోకి వస్తే ఉగ్రవాదుల్ని, పోలీసులపై రాళ్లు రువ్విన వారిని జైలు నుంచి విడుదల చేయాలనే యోచనలో ఉంది' అని అన్నారు. అమిత్ షా వ్యాఖ్యల్ని ఎన్‌సి పార్టీ ఉపాధ్యక్షుడు, జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఖండించారు.

ఆఫ్ఘన్‌లో పోలియో వ్యాక్సినేషన్ రద్దు

- తాలిబన్ ప్రభుత్వ చర్యపై చర్చిస్తున్నామన్న డబ్ల్యుహెచ్ఒ

దుబాయ్ : ఆఫ్ఘనిస్తాన్‌లో పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమాలను తాలిబన్ ప్రభుత్వం రద్దు చేసిందని ఐక్యరాజ్య సమితి సోమవారం వెల్లడించింది. పోలియో విస్తరించే ముప్పు ఎక్కువగా వున్న దేశాల్లో ఒకటి ఆఫ్ఘనిస్తాన్ కాగా, రెండవది పాకిస్తాన్. ఈ నెలలో ఇమ్యూనైజేషన్ ప్రచారం చేపట్టాల్సి వున్న నేపథ్యంలో ముందుగానే ఐక్యరాజ్య సమితి సంస్థలకు తాలిబన్ ప్రభుత్వం తెలిపింది. ఎందుకు రద్దు చేశారో కారణాలు వెల్లడించలేదు. దీనిపై వ్యాఖ్యానించడానికి తాలిబన్ ప్రభుత్వ అధికారులెవరూ అందుబాటులోకి రాలేదు. ఇంటింటికీ తిరిగి వ్యాక్సినేషన్లు వేసే కార్యక్రమానికి బదులుగా మసీదుల్లో ఈ కార్యక్రమం చేపట్టాలని యోచిస్తున్నట్లు డబ్ల్యుహెచ్ఒ తెలిపింది. ఆఫ్ఘనిస్తాన్‌లో గత ఏడాది ఆరు, ఈ ఏడాది 18 పోలియో కేసులు నమోదయ్యాయి. ఆఫ్ఘనిస్తాన్ ప్రస్తుత విధానంలో మార్పు తీసుకువస్తే దాన్ని ప్రభావం, పరిధి ఎంతలా వుంటుందనే విషయమై చర్చిస్తున్నటు డబ్ల్యుహెచ్ఒకి చెందిన డాక్టర్ హమిద్ జఫరీ చెప్పారు. పాకిస్తాన్‌లో తరచుగా హింసాకాండ వల్ల ఈ కార్యక్రమం వాయిదా పడుతోంది.

గాజా దాడుల్లో 20మంది మృతి

- ఇజ్రాయిల్ రక్షణ మంత్రి మార్పు?

గాజా : గాజాలోని నుస్రత్ శరణార్ధ శిబిరంలో ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల్లో పదిమంది మరణించారు. అల్ మావసిలోని బేకరీలో మరో ఐదుగురు చనిపోయారు. జిటూన్, షేక్ రాడ్వాన్ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడుల్లో మరో పది మంది చనిపోయారు. వీరిలో పిల్లలు కూడా వున్నారు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో వాయవ్య జెరికోలోని మురజాత్ ప్రాంతంలో స్కూలుపై సెటిలర్లు జరిపిన దాడిలో విద్యార్ధులు, టీచర్లు తీవ్రంగా గాయపడ్డారు. గత నవంబరులో గాజాలో మరణించిన ముగ్గురు ఇజ్రాయిల్ బందీలు తమ వైమానిక దాడుల్లోనే చనిపోయారని ఇజ్రాయిల్ మిలటరీ అంగీకరించింది. నెలల తరబడి ఈ వార్తను తిరస్కరిస్తూ వచ్చిన సైన్యం తమ దాడుల్లో వారు చనిపోయి వుండడానికి అత్యధిక అవకాశాలున్నాయని ఇప్పుడు అంగీకరించింది. 11 మాసాలుగా కొనసాగుతున్న భీకరమైన ఈ దాడుల్లో 41,226మంది మరణించగా, 95,413మంది గాయపడ్డారు. గాజాలో మొదటి దశ పోలియో వ్యాక్సిన్ 90శాతం పిల్లలకు అందిందని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ ప్రకటించింది. ఈ నెల చివరి నాటికల్లా రెండో డోస్ ఇవ్వాలన్నది తమ లక్ష్యమని ఐక్యరాజ్య సమితి అధికారి ఫిలిప్ లాజారిన్ ఎక్స్‌లో పెట్టిన పోస్టులో పేర్కొన్నారు. 12 రోజులుగా జరుగుతున్న పోలియో వ్యాక్సినేషన్ ప్రచారంలో 400మందికి పైగా పాలస్తీనియన్లు మరణించగా, 900మందికి పైగా గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్యశాఖాధికారులు తెలిపారు.



లెబనాన్‌పై దాడి విషయంలో రక్షణ మంత్రి పట్ల గుర్రుగా వున్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు తక్షణమే ఆయనను మార్చాలని భావిస్తున్నారు. ఈ మేరకు ఇజ్రాయల్ మీడియా వార్తా కథనాలు ఇచ్చింది. ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్‌గాలంట్‌ను డిస్మిస్ చేసి ఆ స్థానంలో నేషనల్ యూనిటీ పార్టీ ఛైర్మన్ గైడన్ సార్‌ను నియమించాలని నెతన్యాహు భావిస్తున్నారు. ప్రస్తుత సమయంలో లెబనాన్‌పై పెద్ద ఎత్తున దాడి వద్దని గాలంట్ అంటున్నారు. ఈ విషయంతో సహా పలు అంశాలపై ఇరువురి మధ్య గొడవ తలెత్తినట్లు మీడియా వార్తలు తెలిపాయి. గైడెన్‌సార్‌ను నియమిస్తారన్న వార్తలను నెతన్యాహు కార్యాలయం ఖండించింది.

శామ్‌సంగ్ కార్మికులపై నిర్బంధం

- ఎనిమిదిరోజులుగా శ్రీపెరంబుదూర్ ప్లాంట్‌లో సమ్మె
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సహా పలువురు కార్మికుల అరెస్టు
- యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తమిళనాడు ప్రభుత్వానికి సిఐటియు విజ్ఞప్తి

న్యూఢిల్లీ : జీతాల పెంపు, ఇతర డిమాండ్లతో తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌లో శామ్‌సాంగ్ ఇండియా ప్లాంట్‌లో సమ్మె చేస్తున్న వారిలో వందమందికిపైగా కార్మికులను, సిఐటియు నాయకులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సమ్మె సోమవారానికి ఎనిమిదో రోజుకు చేరినా, యాజమాన్యం నిర్లక్ష్యంగా ఉండటంతో కాంచీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి నిరసన ప్రదర్శన నిర్వహించాలని కార్మికులు నిర్ణయించారు. వారిని జిల్లా శివార్లలో పోలీసులు అడ్డుకున్నారు. కార్మికులు ఆందోళనకు దిగడంతో వంద మందికిపైగా కార్మికులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. సమ్మెకు సంఘీభావం తెలిపిన సిఐటియు తమిళనాడు ప్రధాన కార్యదర్శి ఇ.ముత్తుకుమార్‌ను కూడా సంస్థ కార్యాలయంలోనే పోలీసులు అరెస్టు చేశారు. ఈ చర్యను సిఐటియు తీవ్రంగా ఖండించింది. అక్రమంగా అరెస్టు చేసిన ముత్తుకుమార్‌ను, కార్మికులను తక్షణమే విడుదల చేయాలని డిమండ్ చేసింది. కార్మికుల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్న శామ్‌సంగ్‌పై చర్యలు తీసుకోవాలని తమిళనాడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌ను కోరింది. చట్టబద్ధమైన ప్రజాస్వామిక హక్కుల ద్వారా నిరసన తెలుపుతున్న కార్మికులను అరెస్టు చేయించడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండించింది. ఏ బహుళజాతి విదేశీ సంస్థ మన జాతీయ చట్టాలను ఉల్లంఘించడానికి అనుమతించకూడదని తెలిపింది. అరెస్టు చేసిన కార్మికులను బేషరతుగా విడుదల చేయాలని, కార్మికుల చట్టబద్ధమైన హక్కులను రక్షణ కల్పించాలని కోరింది. సమ్మె చేస్తున్న శామ్‌సాంగ్ కార్మికులకు మద్దతుగా, సంఘీభావంగా మంగళ, బుధవారాల్లో గేట్, వర్క్‌ప్లేస్ స్థాయి సమావేశాలను నిర్వహించాలని తన అన్ని యూనిట్లకు సిఐటియు పిలుపునిచ్చింది.


ప్లాంట్‌లోని మొత్తం కార్మికులు 1723 మంది ఉండగా, వీరిలో దాదాపు 90 శాతం మంది ఈ సమ్మెలో భాగస్వామ్యమయ్యారు. నో యూనియన్ పాలసీతో ప్రపంచవ్యాప్తంగా కార్మికుల ప్రజాస్వామ్య హక్కులన్నింటినీ కాలరాస్తున్న శామ్‌సంగ్ సమ్మె పట్ల అదే వైఖరితో ఉంది. కార్మికులను చర్చలకు కూడా ఆహ్వానించలేదు. ట్రేడ్ యూనియన్ చట్టం 1926, పరిశ్రమల వివాదల పరిష్కారాల చట్టం 1947తో సహా ఇంటర్నేషనల్ లేబర్ స్టాండర్ట్ (ఐఎల్ఎస్), ఐఎల్ఓ కన్వెన్షన్స్ నంబర్ 87, 98లను సామ్‌సంగ్ యధేచ్ఛగా ఉల్లంఘిస్తోంది. తమిళనాడులోని ప్లాంట్‌లో గృహోపకరణాలను సామ్‌సాంగ్ ఉత్పత్తి చేస్తోంది. సామ్‌సాంగ్ వార్షిక ఆదాయం 12 బిలియన్ల డాలర్లలో మూడో వంతు భారత్‌లోని ప్లాంట్ల నుంచే ఆర్జిస్తోంది. అయినా, భారత్‌లోని కార్మికులపై వివక్ష ప్రదర్శిస్తోంది. ఇక్కడ కార్మికులు తీవ్ర పని ఒత్తిడికి లోనవుతున్నారు. సుదీర్ఘ పనిగంటలలతోపాటు రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్, టివి వంటి ప్రతి ఉత్పత్తిని 10 నుంచి 15 సెకన్లలోనే పూర్తి చేయాలి. సియోల్‌లోని శామ్‌సాంగ్ కార్మికులు సగటున రూ.4.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకూ ఆదాయాన్ని పొందుతుంటే, భారత్‌లో అదే సంస్థలో పనిచేస్తున్న కార్మికులు నెలకు కేవలం రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకూ పొందుతున్నారు. శామ్‌సాంగ్ చర్యలను సిఐటియు తీవ్రంగా విమర్శించింది.

లైంగిక వేధింపుల కేసులో జానీ మాస్టర్

- రాయదుర్గం పిఎస్‌లో ఫిర్యాదు చేసిన మహిళా డ్యాన్సర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ డ్యాన్సర్ జానీ మాస్టర్‌పై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తనను లైంగికంగా వేధింపులకు గురిచేశారని మహిళా డ్యాన్సర్ రెండు రోజుల క్రితం రాయదుర్గం పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు నార్సింగి పిఎస్‌కు బదిలీ చేశారు. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నార్సింగి సిఐ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జానీ మాస్టర్ వద్ద ఓ యువతీ అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా 2019 నుంచి పనిచేస్తున్నారు. అయితే ఓ సారి ముంబాయి వెళ్లినప్పుడు, షూటింగ్ సమయంలోనూ పలుమార్లు ఆమెను లైంగికంగా వేధించాడు. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తారని బెదిరించాడు. ఇటీవల కూడా ఆమెపై వేధింపులకు పాల్పడుతూ 'ఇదే చివరి షూటింగ్' అంటూ ఆమె ఇంటికి పార్శిల్ పంపించాడు. దాంతో బాధితురాలు రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జానీ మాస్టర్ తనను వేధింపులకు గురిచేస్తున్నాడని, అతని నుంచి తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. జానీ మాస్టర్‌పై సెక్షన్ 376 కింద రేప్ కేసుతో పాటు క్రిమినల్, బెదిరింపు, 323 కింద కేసు నమోదు చేశారు. పూర్తి విచారణ చేపట్టి, జానీ మాస్టర్‌పై చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.



జనసేన నుంచి సస్పెన్షన్

జానీ మాస్టర్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ జనసేన పార్టీ నిర్ణయం తీసుకుంది. ఆయనపై లైంగిక వేధింపుల కేసు నమోదు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ నేత వేములపాటి అజయ్‌కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు.

అయోధ్యలో పారిశ్రామికవేత్తల జులుం

లక్నో : ఉత్తర ప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశాలతో అయోధ్యలో పారిశ్రామికవేత్తలు రెచ్చిపోతున్నారనీ, దళితులు, బిసిలు, రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని అక్కడి ప్రధాన ప్రతిపక్షం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) విమర్శించింది. అయోధ్యలో చాలా వెనుకబడిన తరగతి మాఝీ కులానికి చెందిన వారి భూమిని బిజినెస్ గ్రూపు ఆక్రమించుకుంటున్నదనీ, ఆ గ్రూపునకు సంబంధించిన వ్యక్తులు రైతులతో గొడవ పడుతున్నారని పేర్కొన్నారు. రెండు గ్రూపుల మధ్య భూమి ఆక్రమణకు సంబంధించిన గొడవగా చెప్పబడుతున్న ఒక వీడియోను ఎస్‌పి చీఫ్ అఖిలేశ్ యాదవ్, ఆయన పార్టీ పోస్ట్ చేసింది.



మీకోసం

సాంబారు మరుగుతున్నప్పుడు ఒక చెంచా నిమ్మరసం కలిపితే చాలా రుచిగా ఉంటుంది.

జీవన సౌరభం

జీవితంలో అన్నీ కోల్పోయినా భవిష్యత్తు మాత్రం మిగిలే వుంటుంది. దానిని జాగ్రత్తగా నిర్మించుకోవాలి.

చెట్టు గర్వం



ఒక సముద్రం ఒడ్డు మీద పెద్ద చెట్టు ఉంది. అది రంగురంగుల పుష్పాలతో, పండ్లతో అందంగా కనబడేది. దాని చుట్టూ ఉన్న చిన్న మొక్కలు, చెట్టుపై వాలే పక్షులు ఆ చెట్టుని అందంగా ఉన్నావని పొగిడేవి. దాంతో చెట్టుకి తనంత అందమైనవాళ్లు మరెవరూ లేరన్న గర్వం పెరిగిపోయింది.


ఒకసారి ఆ చెట్టు సముద్రాన్ని చూసి 'నువ్వు ఎంత పెద్దవాడివయినా, నీకు నాలాగా అందం లేదు. నీ నీళ్లు ఉప్పగా ఉంటాయి, ఎవరూ తాగలేరు. నేను, నా ఆకులు, పువ్వులు, ఫలాలు అందరికి ఉపయోగపడతాము' అంది గర్వంగా.

సముద్రం నవ్వి 'నువ్వన్నది నిజమే. కానీ అది తాత్కాలికం. వసంతకాలం వస్తే నీ పూలు చిగురిస్తాయి. ఆ కాలం పోగానే ఎండిపోతాయి. నేను నీలా కాదు. నా లోపల ఎన్నో రహస్యాలు దాగున్నాయి. నేను ఎన్నో జీవరాసులకు నివాసం కల్పిస్తాను. నా లోపల ఎంతో గొప్ప జీవ సంపద ఉంది. నా లోతు, విస్తీర్ణం ఎంత పెద్దవో శాస్త్రజ్ఞులు, సముద్ర పరిశోధకులకు మాత్రమే తెలుస్తుంది. నీలాంటి చెట్టుకి ఇవేమీ అర్థం కావు. నీ పరిధి చాలా చిన్నది' అంది. దాంతో చెట్టు గర్వం అణిగిపోయింది. మన చుట్టూ ఉన్నవాళ్లు అవసరానికో లేక సరైన అవగాహన లేకో పొగిడినంత మాత్రాన గర్వం పెంచుకోకూడదని తెలుసుకుంది. వాళ్లంతా అలా అనబట్టే కదా సముద్రం అంత గొప్ప దాన్ని తక్కువ చేసి మాట్లాడాను అని సిగ్గు పడింది.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు,
94907 99203.


చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ వరుసగా ఉన్న అంకెల పక్కన ఉన్న చుక్కలను కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి చూద్దాం!



నేను గీసిన బొమ్మ





అనిద హర్లీన్,
3వ తరగతి,
ఎంపియుపి ఉర్దూ స్కూలు,
నులకపేట,
గుంటూరు జిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఈగలు, దోమల నుంచి జాగ్రత్తే ముఖ్యం

ఆగస్టు నెలచివరలోనూ, ఈనెల ఆరంభంలోనూ ఎడతెరిపి లేకుండా వారంరోజులపాటు కురిసిన వర్షాలు.. వచ్చిన వరదలు.. రెండు తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేశాయి. ప్రస్తుతం వర్షాలు లేకపోయినా... ఎండలు కాస్తున్నా, వరద మిగిల్చిన నష్టం, దోమలూ ఈగల బెడద ప్రజానీకాన్ని వెంటాడుతున్నాయి.



ఓ వైపు మంకీఫాక్స్ వంటి కొత్తరోగాల భయం ప్రజలను వెంటాడుతూ ఉంటే తాజాగా ఏటేటా వచ్చే సీజనల్ వ్యాధులు ప్రజల వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. టైఫాయిడ్, మలేరియా, చికున్‌గున్యాతోపాటు డెంగీ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. సీజన్ మారటం, ఇటీవలకాలంలో పగలు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం, మురుగునీటి సమస్యలు, తాగునీటి కలుషితం వంటి సమస్యలతో రాష్ట్రంలోని ప్రజానీకం నానా అవస్థలు పడుతున్నారు. దోమలు ఉధృతి బాగా పెరిగింది. ఇప్పటికే వ్యాధులు చుట్టుముట్టడంతో రోగులు ఆసుపత్రుల చుట్టూ ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ప్రతివీధిలోనూ దుర్గంధం వెదజల్లింపులూ, దోమలకు ఆవాస కేంద్రాలూ తెలిసిందే. ఇలాంటి దుష్పరిణామాలే జ్వరాలకు కారణమవుతున్నాయి.

వరద ముంపు ప్రాంతాల్లో తీవ్ర దుర్గంధం కొనసాగుతోంది. రోజుల తరబడి నీరు నిలబడి ఉండటం, వర్షపునీటిలో డ్రెయినేజీ నీరు కలిసి లోతట్టు ప్రాంతాలు, ఖాళీస్థలాల్లో ఇంకా నిలబడివుండటంతో ఆ కంపు భరించలేక బాధిత ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు. వరద నీటిలో నాని పాడైపోయిన చెత్తసామాన్లు, ఇతర మురిగిపోయే వస్తువులు ప్రతి సందులో దర్శనమిస్తుండటంతో ఈగలు, దోమలు ముసురుకుంటున్నాయి. ఇప్పటికే వరద ముంపు ప్రాంతాల్లో విష జ్వరాలు బాగా విజృంభించాయి. దగ్గు, జలుబులు అందరినీ పీడిస్తున్నాయి. వరదనీటిలో చిక్కుకున్న వారిలో ఎక్కువమంది కాళ్లు పాచి అలర్జీగా మారి ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువమంది చర్మవ్యాధులతో బాధపడుతున్నారు. బ్లీచింగ్ ఎక్కువగా చల్లిస్తేనే దుర్గంధం, గాలిలోనూ, తేమ ప్రాంతాల్లోని బ్యాక్టీరియా, వైరస్‌లు చనిపోతాయి. లేనిపక్షంలో అక్కడి ప్రజానీకం అనారోగ్య పరిస్థితుల్లోకి నెట్టేయటం ఖాయం. ముఖ్యంగా ఈగలు, దోమలు వంటివి కూడా ముప్పేటా దాడి చేస్తున్నాయి. వాటి నిర్మూలనపైనా పాలకులు, అధికార యంత్రాంగం దృష్టిసారించాల్సి వుంది.

దోమల నిర్మూలనకు ...

వర్షాకాలం, శీతాకాలంలో సాధారణంగా దోమల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. వీటి కాటుకు గురైతే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులకు గురౌతాము. ఇలాంటి పరిస్థితుల్లో దోమల నుంచి ప్రతిఒక్కరూ తమను తాము రక్షించుకోవాలంటే దోమతెరలను వాడాల్సిందే. మనతోపాటుగా కుటుంబ సభ్యులంతా వీటిని వాడితే దోమల నుంచి రక్షణ పొందొచ్చు. మన ఇంట్లో ఉన్న సరుకులు, కూరగాయలు వంటి వాటి ద్వారా కూడా దోమలను నిర్మూలించొచ్చు. వాటి బారిన పడకుండా ఉండొచ్చు. ఒక నిమ్మకా తీసుకుని కొన్ని లవంగాలు, ఆవాల నూనె, ఒక దూది లేదా దీపపు ఒత్తి, కొన్ని కర్పూరం బిళ్లలు తీసుకోవాలి. నిమ్మకాయ పై భాగాన్ని కట్ చేసి అందులోని నిమ్మరసాన్ని కొంత బయటకు తీసేయాలి. ఆ తర్వాత అందులో కొద్దిగా ఆవాల నూనె పోసి దానితో ఉంచిన లవంగాలు, కర్పూరం జోడించండి. ఆతర్వాత దానిపై దీపం వత్తి పెట్టి అగ్గిపెట్టెతో వెలిగించాలి. తలుపులు మూసేస్తే ఆ వాసనకు దోమల బెడద బాగా తగ్గుతుంది. నిమ్మకాయను సగానికి కోసి అందులో కొన్ని లవంగాలను వేసి అవసరమైన చోట ఉంచితే దోమల బెడద తగ్గుతుంది.

ఈగల నుంచి రక్షణ ఇలా ...


ఈ కాలంలో ఈగల సమస్య కూడా తీవ్రంగానే ఉంది. ఇళ్లపై దండయాత్ర చేస్తుండటం చూస్తూనే ఉన్నాం. ఈగలు వాలిన ఆహార పదార్థాలు తీసుకుంటే కలరా, విరేచనాలు, టైఫాయిడ్, డయేరియా వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కొన్ని సులభమైన చిట్కాలను పాటిస్తే సులభంగానే ఇంట్లో నుంచి ఈగలను తరిమికొట్టొచ్చు. వంటగదిలో, బాత్‌రూమ్‌లో, ఇంటి ఆవరణలో ఈగలు మోతెక్కిస్తాయి. ఈగలు ఇంట్లోని పండ్లు, కూరగాయలు, ఆహార పదార్థాలపై వాలడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి.

ఈగల గుంపును మన ఇంట్లో నుంచి తరమటానికి ఉప్పు ప్రభావవంతంగా పనిచేస్తుంది. అవి ఉప్పుకు దూరంగా ఉంటాయి. ఒక గ్లాసు నీటిలో 2 టీస్పూన్ల ఉప్పు వేసి మిక్స్ చేయాలి. ఈ లిక్విడ్‌ను స్ప్రే బాటిల్‌లో నింపి ఇల్లు అంతా పిచికారీ చేయాలి. ఇలా చేస్తే ఈగలు మీ ఇంట్లో నుంచి పారిపోతాయి. కర్పూరం వెలిగించి ఇంట్లో పొగ వ్యాప్తిచెందేలా చేస్తే ఈగలు వెంటనే పారిపోతాయి. 8 నుంచి 10 బిళ్లలను పొడిచేసి ఒక గ్లాసు నీటిలో కలపండి. వీటిని దోమలు ఉన్న చోట్ల చల్లండి. ఇంట్లోని మూలల్లో కర్పూరం ఉంచాలి. దాని వాసనకు ఈగలు కూడా రాకుండా ఉంటాయి. ఇది ప్రతిరోజూ క్రమం తప్పకుండా చేయాలి.

యాపిల్ సైడర్ వెనిగర్ ఒక గ్లాసులో తీసుకుని దానికి కొన్ని చుక్కల డిష్‌సోప్ కలపండి. గ్లాసును ప్లాస్టిక్ ర్యాప్‌ని ఉంచి రబ్బరు బ్యాండ్ వేయండి. ఆ తర్వాత టూత్‌పిక్‌తో ప్లాస్టిక్ ర్యాప్‌పై చిల్లులు పెట్టండి. ఈగలు దానికి ఎట్రాక్ట్ అయ్యి..రంధ్రాల ద్వారా గ్యాస్ లోపలికి వెళ్తాయి. మళ్లీ బయటకు రావు. పావు కప్పు యాపిల్ సిడార్ వెనిగర్‌లో 50 చుక్కల యూకలిప్టస్ ఆయిల్‌ని కలపాలి. ఆ మిశ్రమాన్ని ఒక బాటిల్‌లో మిక్స్‌చేసి ఈగలున్నచోట్ల చల్లాలి. ఇలా చేస్తే ఈగల సమస్య దూరమవుతుంది.

పీరియడ్ నొప్పి ఇలా తగ్గించుకోండి

దగ్గరపడుతుంటేనే చాలామంది భయపడిపోతారు. శారీరక అలసట, అసౌకర్యం, ఆందోళన చిన్న విషయానికే కోపం రావడం వంటి లక్షణాలు సాధారణంగా పీరియడ్స్ వచ్చే సమయంలో కనబడుతుంటా యని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. దీంతోపాటు అధిక రక్తస్రావం, శారీరక బలహీనత, తీవ్రమైన కడుపునొప్పి కూడా వేధిస్తుంటాయి. ఇదంతా సహజమైన ప్రక్రియే అయినప్పటికీ ఆ సమయంలో ఇబ్బందిగా, అసౌకర్యంగా ఉంటుంది. అయితే కొన్ని చిట్కాలు పాటిస్తే ఆ నొప్పుల నుండి ఉపశమనం పొందవచ్చు అంటున్నారు ఆరోగ్య నిపుణులు.



- నెలసరి సమయంలో కడుపునొప్పి వేధిస్తుంటే.. తీసుకునే ఆహారంపై కూడా శ్రద్ధ పెట్టాలి. ముఖ్యంగా చిప్స్, పిజ్జా, బర్గర్ వంటివి తినకూడదు. అలాగే ఉప్పు, తీపి, కారం అధికంగా ఉండే ఫుడ్స్, ఇతర వంటకాలు, ఆహార పదార్థాలు తీసుకోకపోవడం మంచిది. వీటిని తినడంవల్ల శరీరం అసౌకర్యానికి గురవుతుంది. కడుపు నొప్పి మరింత పెరిగే చాన్స్ ఉటుందని నిపుణులు చెబుతున్నారు.
- పీరియడ్స్ కారణంగా కొందరు ఫిజికల్ యాక్టివిటీస్ పూర్తిగా ఆపేస్తుంటారు. అయితే తేలికపాటి వ్యాయామాలు లేదా వాకింగ్ లాంటివి చేయడం మంచిదే అంటున్నారు ఆరోగ్య నిపుణులు. పైగా వీటివల్ల రుతు క్రమానికి సంబంధించిన ఇబ్బందుల నుంచి కాస్త రిలీఫ్ పొందుతారని అంటున్నారు. అలాగే ఎక్కువసేపు ఏమీ తినకుండా కూడా ఉండకూడదు. శక్తి అవసరం కాబట్టి పోషకాహారం తినాలి. అయితే చక్కెర, జంక్ ఫుడ్స్, ఆయిలీ ఫుడ్స్‌కు మాత్రం దూరంగా ఉండాలి.
- రుతుక్రమంలో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. దీంతో మానసిక ఆందోళన, చికాకు వంటి లక్షణాలు కనిపించడం సహజమే. అలాంటప్పుడు విశ్రాంతి తీసుకోవడం చాలా అవసరం. అలాగే రాత్రిళ్లు ఎక్కువసేపు మేల్కోవడం మానుకోవాలి. నిద్రలేమి శారీరక అసౌకర్యాన్ని మరింత పెంచుతుంది.
- టీ, కాఫీ వంటి కెఫిన్ రిలేటెడ్ డ్రింక్స్‌ను పీరియడ్స్ సమయంలో కచ్చితంగా నివారించాలి. వీటివల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. అంతేకాకుండా తలనొప్పి, కళ్లు లాగడం వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి. అలాగే పాలు, పాల ఉత్పత్తులను తీసుకోవడంవల్ల ఆ సమయంలో కడుపులో ఉబ్బరం, మలబద్దకం, హార్ట్ బర్న్ వంటి సమస్యలు పెరగవచ్చు.



రేవంత్‌కు చెక్కు అందజేసిన చిరంజీవి


ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో వరద ధాటికి నష్టపోయిన బాధితులకు సినీతారలు అండగా నిలుస్తున్నారు. తనవంతుగా హీరో చిరంజీవి ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఇరు రాష్ట్రాల సిఎంల సహాయనిధికి రూ.50 లక్షలు చొప్పున రూ.కోటి ఇచ్చేందుకు ముందుకొచ్చారు. తెలంగాణా సిఎం రేవంత్‌రెడ్డిని చిరంజీవి కలిసి రూ.50 లక్షల చెక్కును అందజేశారు. తన కుమారుడు రామ్‌చరణ్ తరఫున మరో రూ.50 లక్షలు అందజేశారు. చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర' చిత్రంలో నటిస్తున్నారు. వశిష్ట ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు.

4న 'కలి' మూవీ విడుదల



యువ హీరోలు ప్రిన్స్, నరేష్ అగస్త్య నటిస్తున్న సినిమా 'కలి'. ప్రముఖ రచయిత కె.రాఘవేంద్రరెడ్డి సమర్పణలో రుద్ర క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. శివ శేషు రచనతోపాటు దర్శకత్వం వహిస్తున్నారు. లీలాగౌతమ్‌వర్మ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సైకాలాజికల్ థ్రిల్లర్ కథతో ఈ చిత్రం తెరకెక్కింది. నేహా కృష్ణన్, గౌతంరాజు, గుండు సుదర్శన్, కేదార్‌శంకర్, మనిచందన, మధుమణి తదితరులు నటించారు.

సంగీతం జీవన్‌బాబు, ఎడిటర్‌గా విజయ్ కట్స్, సినిమాటోగ్రఫీ నిషాంత్ కటారి, రమణ జాగర్లమూడి, పాటలు సరస్వతీపుత్ర, రామజోగయ్యశాస్త్రి, క్రియేటివ్ ప్రొడ్యూసర్స్‌గా రాధాకృష్ణ తాతినేని, ధరణికుమార్ టీఆర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఫణీంద్ర వ్యవహరిస్తున్నారు.



ఓటీటీలో 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' రికార్డులు

చైతన్యరావు, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్', ఓటీటీలో ఈ సినిమా దూసుకెళు తోంది. కెకెఆర్, బాలరాజ్ నిర్మించారు. బాలరాజశేఖరుని దర్శకత్వం వహించారు. సిస్టా విఎంకె కెమెరాను అందజేశారు. బిగ్‌ఫిష్ సనిమాస్ ద్వారా ఆగస్టు 27 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే ఈ చిత్రానికి 40 మిలియన్ల వ్యూస్ వచ్చాయి.



ఆసక్తికరంగా 'గొర్రె పురాణం' ట్రైలర్

హీరో సుహాస్ నటించిన తాజా చిత్రం 'గొర్రెపురాణం'. బాబీ దర్శకత్వం వహించారు. సోమవారంనాడు ఈ చిత్రం ట్రైలర్‌ను మేకర్లు విడుదల చేశారు. ఈ సినిమా ఈనెల 20న విడుదల కానుంది. ఒక గ్రామంలో రెండు మతాల మధ్య ఒక గొర్రె ఎలా చిచ్చు పెట్టిందో ట్రైలర్‌తో హింట్ ఇచ్చారు. కోర్టు కేసులు, గొడవలు ఇలా అన్నీ ఒక గొర్రె చుట్టూ సాగే ఎమోషనల్ డ్రామాగా ఈ సినిమాను తెరకెక్కించారు.



ఎంఎస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌పై చర్చ

మరోసారి ఎంఎస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌పై పరిశ్రమలో చర్చ జరుగుతోంది. తన పాటలతో భారతీయ సంగీతాన్ని ఆమె విశ్వవ్యాప్తం చేశారు. సోమవారం ఆమె 108వ జయంతిని పురస్కరించుకుని పరిశ్రమలోని ప్రముఖులంతా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాలీవుడ్ నటి విద్యాబాలన్ ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను విద్యాబాలన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. అయితే ఎంఎస్ సుబ్బులక్ష్మి బయోపిక్ త్వరలోనే పట్టాలెక్కనున్నట్లుగా సమాచారం.

ఫైనల్‌కు భారత్

- సెమీస్‌లో కొరియాపై ఘన విజయం
- టైటిల్‌కై నేడు చైనాతో ఢీ



హులున్‌బుయిర్(చైనా): ఆసియా చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లోకి భారత్ వరుసగా రెండోసారి ప్రవేశించింది. సోమవారం కొరియాతో జరిగిన సెమీఫైనల్లో భారత్ 4-1గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ టోర్నమెంట్‌లో హర్మన్‌ప్రీత్ సేన అజేయంగా ఫైనల్‌కు దూసుకెళ్లింది. సోమవారం కొరియాపై సంపూర్ణ ఆధిపత్యం చెలాయించిన టీమిండియా.. ఆటగాళ్ల ధాటికి కొరియా డిఫెన్స్ కకావికలం అయింది. ఆరంభం నుంచి ప్రత్యర్థిని వణికించిన టీమిండియా.. అదే ఊపులో కొరియాకు చెక్ పెట్టింది. గురువారం జరిగే టైటిల్ పోరులో ఆతిథ్య చైనాతో హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం తలపడనుంది. దీంతో ఒలింపిక్స్‌లో వరుసగా రెండో కాంస్యంతో నయా చరిత్ర సృష్టించిన భారత జట్టు మరో టైటిల్‌కు చేరువైంది. తొలుత ఉత్తమ్ సింగ్ 13వ నిమిషంలో మొదటి గోల్ అందించాడు. దీంతో తొలి క్వార్టర్ ముగిసేసరికి భారత్ 1-0 ఆధిక్యతలో నిలిచింది. ఆ తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్(19, 45వ నిమిషంలో) రెండు గోల్స్‌తో ఆధిక్యాన్ని మరింత పెంచాడు. ఆ తర్వాత కొరియా ఆటగాళ్లు గోల్ కోసం ఎంత ప్రయత్నించినా భారత డిఫెన్స్, గోల్‌కీపర్ వాళ్ల ఆటలు సాగనివ్వలేదు. జమన్ ప్రీత్ సింగ్(32 నిమిషంలో) మరో గోల్ కొట్టడంతో కొరియా ఆశలకు తెరపడింది. ఈ మ్యాచ్‌లో భారత డిఫెండర్లు అద్భుతంగా రాణించారు. ఫార్వర్డ్‌లో అర్జీత్ సింగ్ మెరిసాడు. కొరియా తరఫున ఏకైక గోల్ మూడో క్వార్టర్‌లో నమోదైంది.

షూటౌట్‌లో పాకిస్తాన్‌కు చైనా చెక్..

ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో ఆతిథ్య చైనా అదరగొట్టింది. ఈ టోర్నీ చరిత్రలో తొలిసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. సోమవారం జరిగిన సెమీఫైనల్లో మూడుసార్లు చాంపియన్ పాకిస్థాన్‌ను షూటౌట్‌లో చిత్తుచేసింది. ఆట ఆరంభం నుంచి పాక్ జట్టుకు ముచ్చెమటలు పట్టించిన చైనా ఆటగాళ్లు 1-1తో స్కోర్ సమం చేశారు. ఆ తర్వాత జరిగిన పెనాల్టీ షూటౌట్‌లోనూ చైనా ఆటగాళ్లు అద్భుతం చేశారు. 2-0తో ఆధిపత్యం కనబరిచి పాక్‌ను సాగనంపారు. పాకిస్తాన్‌కు ఐదుసార్లు పెనాల్టీ కార్నర్‌ల ద్వారా గోల్ కొట్టేందుకు అవకాశం లభిం చినా.. చైనా డిఫెన్స్ చిత్తుచేసింది. 37వ ని.లో అహ్మద్ నదీమ్ ఒక గోల్ కొట్టగా.. చైనా తరఫున ఏకైక గోల్‌ను 18వ ని.లో డ్రాగ్‌ఫికర్ యువాన్లిక్ చేశాడు. చైనా గోల్ కీపర్ సై యు వాంగ్ జట్టుకు అడ్డు గోడలా నిలిచి జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. దీంతో చైనా తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. పాకిస్తాన్, కొరియా జట్ల మధ్య కాంస్య పతకం పోరు.. 5, 6 స్థానాలకోసం మలేషియా-జపాన్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

సర్ఫరాజ్‌కు పిలుపు

- 19నుంచి చెన్నై వేదికగా బంగ్లాదేశ్‌తో తొలిటెస్ట్



చెన్నై: బంగ్లాదేశ్‌తో 19నుంచి జరగనున్న తొలి టెస్ట్‌కు అందుబాటులో ఉండాలని యువ ఆటగాడు సర్ఫరాజ్‌ఖాన్‌కు పిలుపొచ్చింది. మిడిలార్డర్‌ను పటిష్టం చేయడమే లక్ష్యంగా బిసిసిఐ సెలెక్టర్లు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సర్ఫరాజ్ ఖాన్‌ను ఆఘమేఘాల మీద ఎంఎ చిదంబరం స్టేడియంలో చేరుకోవాలని పేర్కొంది. దీంతో అతడు టీమిండియా జట్టు ఆటగాళ్ల సోమవారం జతకలిసాడు. దులీప్ ట్రోఫీ రెండు రౌండ్ మ్యాచ్‌లు ముగియడంతో 26ఏళ్ల సర్ఫరాజ్ ఆఘమేఘాల మీద చెన్నైకు బయల్దేరాడు. ఎం.ఎ చిదంబరం స్టేడియంలో గురువారం(సెప్టెంబర్ 19) నుంచి బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్ జరగనుంది. శుభ్‌మన్, జైస్వాల్ దులీప్ ట్రోఫీ తొలిరౌండ్ పోటీలు ముగిసిన తర్వాత బంగ్లాతో టెస్ట్ సిరీస్ ఆడేందుకు బయల్దేరి వెళ్లగా.. సర్ఫరాజ్ ఖాన్ మాత్రం రెండోరౌండ్ మ్యాచ్‌లు ముగిసిన తర్వాత వచ్చాడు. కెఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్‌లను సెలెక్టర్లు బంగ్లాతో టెస్ట్‌కు అందుబాటులో ఉండాలని కోరడంతో బిసిసిఐ ఈ నిర్ణయం తీసుకుంది. మిడిలార్డర్ బ్యాటింగ్ విభాగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా టీమిండియా సెలెక్టర్లు ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. కెరీర్ ఆరంభంలో కెఎల్ రాహుల్ స్థానంలో రాజ్‌కోట్ టెస్ట్‌లో అరంగేట్రం చేసిన సర్ఫరాజ్ 50.0 సగటుతో 200పరుగులు చేసి అద్భుతంగా రాణించిఆడు. వీరితోపాటు ఆకాశ్ దీప్, ధృవ్ జురెల్ కూడా టీమిండియాలో చోటు కోసం ప్రయత్నిస్తున్నారు. కెఎల్ రాహుల్, విరాట్ కోహ్లి సుదీర్ఘ ఫార్మాట్(టెస్టు)లో కొనసాగుతుండడంతో అతడి స్థానానికి గట్టి పోటీ ఎదురుకానుంది.

బంగ్లాను తేలిగ్గా తీసుకోవద్దు: రోహిత్

బంగ్లాదేశ్‌ను ఏమాత్రం తేలిగ్గా తీసుకోవద్దగా టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అభిప్రాయ పడ్డాడు. ఈ సిరీస్‌కు ముందు ఆ జట్టు పాకిస్తాన్ పర్యటనకు వెళ్లి అక్కడ సిరీస్ చేజిక్కించుకొన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023-25లో డబ్ల్యుటిసి పాయింట్ల సాధనే లక్ష్యంగా ఈ సిరీస్ జట్టు సభ్యులంతా చెలరేగితే గెలుపు తథ్యమని అన్నాడు.

ఐఓసి అధ్యక్ష రేసులో కోవెంట్రీ, సెబాస్టియన్

- మరో తొమ్మిదిమంది కూడా..

రోమ్: అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐఓసి) అధ్యక్షుడు థామస్ బాచ్ తర్వాత ఈ పీఠాన్ని అధిరోహించేందుకు భారీ సంఖ్యలో అభ్యర్థులు రేసులో నిలుస్తున్నారు. తాజాగా రెండుసార్లు ఒలింపిక్ ఛాంపియన్లు కిర్స్టీ కోవెంట్రీ, సెబాస్టియన్ కో కూడా రేసులోకి వచ్చారు. 200మీ. బ్యాక్‌స్ట్రోక్‌లో మాజీ ప్రపంచ రికార్డు హోల్డర్ అయిన కోవెంట్రీ ఈ జాబితాలో ఉన్న ఏకైక మహిళ. జింబాబ్వే నుండి ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యురాలు కూడా అయిన కోవెంట్రీ 130ఏళ్ల చరిత్రలో పురుష అధ్యక్షులను మాత్రమే కలిగి ఉన్న ఐఓసికి తొలిసారి అధ్యక్ష రేసులో నిలిచిన ఏకైక మహిళ ఈమె మాత్రమే. అలాగే ఎనిమిది మంది ఐరోపా ఖండం నుంచి మరొకరు అమెరికా నుంచి ఉన్నారు. ఇక సెబాస్టియన్ కో, 1980(మాస్కో) మరియు 1984(లాస్ ఏంజెల్స్)లో రెండు బంగారు పతకాలతో సహా నాలుగుసార్లు ఒలింపిక్ పతకాలను చేజిక్కించుకున్నాడు. బ్రిటన్ తరఫునుంచి అధ్యక్ష స్థానం కోసం ప్రధాన పోటీదారుగా రేసులో ఉన్నాడు. ఐఓసి సోమవారం తాజాగా అధ్యక్ష రేసులో ఉన్న అభ్యర్థుల జాబితాను వెల్లడించింది. వీరితోపాటు జోర్డాన్ యువరాజు ఫీసల్ అల్ హుస్సేన్, జువాన్ ఆంటోనియో సమరాంచ్ జూనియర్ కూడా ఉన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68